


అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

08.08.2026

శనివారం |రంగారెడ్డి

సంపుటి : 01 | సంచిక: 39

పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


# నాగార్జున సాగర్‌లో రేవంత్ రెడ్డి వరుణ యాగం

- ముహూర్తం ఖరారు చేసిన ప్రభుత్వం
- రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షా లు కురిసి..
- పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ..
- ప్రభుత్వం తరపున మహా వరుణ యాగం
- ఆగస్టు 10వ తేదీన శుభ ముహూర్తం



**హైదరాబాద్, ఆగస్టు 07, అనంతజనశక్తి న్యూస్**

**తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షా లు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం తరపున మహా వరుణ యాగం నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఎల్‌నినో వంటి వాతావరణ ప్రతికూల ప్రభావాలు తగ్గి, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలనే బృహత్తర సంకల్పంతో నాగార్జునసాగర్ వేదికగా ఈ పవిత్ర వైదిక క్రతువుకు శ్రీకారం చుట్టారు.**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ప్రధాన అర్చకులు, వేద పండితులు, దేవస్థాన సిద్ధాంతి శాస్త్రోక్తంగా చర్చించి ఆగస్టు 10వ తేదీని శుభ ముహూర్తంగా నిర్ణయించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్ డ్యామ్ తీరాన ఉన్న విజయవిహార్ ప్రాంగణంలో ఈ యాగం వైభవంగా జరగనుంది. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట క్షేత్ర పండితులు, అర్చకులు వేద మంత్రోచ్చారణలతో యాగాన్ని నిర్వహించనున్నారు. ఈ పవిత్ర వైదిక క్రతువు కోసం ప్రాంగణంలో ప్రత్యేకంగా 11 హోమకుండాలను సిద్ధం చేస్తున్నారు.
సుమారు 108 మంది ఋత్వికులు, వేద పండితులు ఈ యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు సమర్పిస్తారు. కృష్ణా, గోదావరి నదుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరాలని, డ్యామ్‌లు, జలాశయాలు, చెరువులు, కుంటలు జలకళ సంతరించుకోవాలని సంకల్పిస్తున్నారు. ఆకలి తీర్చే అన్నదాతల పాడిపంటలు సమృద్ధిగా పండి రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా ప్రత్యేక వేద ప్రార్థనలు చేపడతారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి పూర్తి సారథ్యంలో ఈ మహా వరుణ యాగానికి సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆగస్టు 10వ తేదీన రోజంతా జరిగే ఈ యాగ క్రతువు మధ్యాహ్నం 3:24 గంటలకు జరిగే మహత్తర పూర్ణాహుతితో ముగుస్తుంది. ఈ పవిత్ర సంపూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్వయంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.



## ఎన్ని అవమానాలైనా నేను భరిస్తా

**తమిళనాడు ప్రజల కోసం..**

**'కావేరీ' విషయంలో ఉదయనిధికి..**

**సీఎం విజయ్ ఘాటు రిప్లై**



2లో..

**చెన్నై, ఆగస్టు 07, అనంత జనశక్తి న్యూస్**

తమిళనాడు శాసనసభ సమావేశాలు కావేరీ నదీ జలాల వివాదంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నడుమ సాగుతున్నాయి. మేకెదాటు ప్రాజెక్ట్ నిర్మాణం, పొరుగు రాష్ట్రమైన కర్ణాటకతో చర్చల అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య పడిపోతున్న తీవ్ర స్థాయి మాటల యుద్ధం సభను వేడెక్కించింది. ప్రతిపక్ష డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ విసిరిన విమర్శల బాణాలకు.. ముఖ్యమంత్రి విజయ్ అంతే శక్తివంతంగా, గణాంకాలతో కూడిన ఆధారాలతో తీవ్రస్థాయిలో తిప్పికొట్టారు.

## ఉభయ సభలకు హాజరుకావాల్సిందే..

- ఆ మూడు రోజులు ఎంతో కీలకం
- కాంగ్రెస్ ఎంపీలకు విప్ జారీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 07, అనంతజనశక్తి న్యూస్**

వివాదాస్పద ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా తమ పార్టీకి చెందిన ఉభయ సభల ఎంపీలకు కాంగ్రెస్ విప్ జారీ చేసింది. ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లుపై ప్రభుత్వం చర్చ చేపట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో రాజ్యసభ, లోక్‌సభ రెండింటిలోనూ కాంగ్రెస్ ఎంపీలు తప్పనిసరిగా హాజరు కావాలని అధిష్ఠానం స్పష్టం చేసింది. ఆగస్టు 10, 11, 12 తేదీల్లో తమ తమ సభల్లో తప్పనిసరిగా హాజరు కావాలని పార్లమెంటు సభ్యులను కోరింది. ఈ మేరకు రాజ్యసభలోని కాంగ్రెస్ చీఫ్ విప్ జైరామ్ రమేశ్ విప్ జారీ చేశారు.

2లో..

## ప్రతి భారతీయుడూ.. చేనేతకు అండగా నిలవాలి

**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

**భారతదేశపు గొప్ప నేత వారసత్వం**

**సజీవంగా ఉంచు తున్న చేతులకు అభినందనలు**



2లో..

## ఆందోళన వద్దు.. మీకు నేను ఉన్నాను

- టీఎంసీ, ఉద్ధవ్ సేన రెబల్ ఎంపీలకు
- ప్రధాని నరేంద్ర మోదీ భరోసా
- పార్లమెంట్ సమావేశాల్లో గందరగోళం
- చర్చలకు సిద్ధంగా ఉండాలని సభ్యులకు సూచన

2లో..



**న్యూఢిల్లీ, ఆగస్టు 07, అనంతజనశక్తి న్యూస్**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా కొనసాగుతున్న నిరసనలు, గందరగోళం నడుమ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కొత్తగా ఎన్నికైన ఎన్డీఏ లోక్‌సభ ఎంపీలతో శుక్రవారం బ్రేక్‌ఫాస్ట్ భేటీ నిర్వహించారు. పార్లమెంటరీ చర్చలలో చురుకుగా పాల్గొనాలని ఈ సందర్భంగా ఆయన వారిని కోరారు. పార్లమెంట్ అనేది 'ప్రజాస్వామ్యానికి అత్యున్నత దేవాలయం' అని మోదీ స్పష్టం చేశారు. అయితే, ఇటీవలి జరుగుతోన్న ఆటంకాల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ గందరగోళం కారణంగా కొత్త ఎంపీలకు సభలో మాట్లాడే అవకాశం లభించడం లేదని ఆయన అన్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

## మంత్రి నారా లోకేశ్‌పై ప్రధాని మోదీ ప్రశంసలు

**భోగాపురం ఈవెంట్ అద్భుతమంటూ కితాబు**

**మోదీతో ఎంపీ అప్పలనాయుడు భేటీ**

2లో..



## నేతన్నలకు అండగా నిలువాలి

**రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ**

**తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి వెన్నెముక చేనేత కార్మికుల పరిస్థితి తీవ్రంగా దిగజారింది**

**'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' ఆపేసి..**

**నేతన్నలను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టారు**

5లో..



**హైదరాబాద్, ఆగస్టు 07, అనంత జనశక్తి న్యూస్**

తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి వెన్నెముకగా నిలిచిన చేనేత కార్మికుల పరిస్థితి కాంగ్రెస్ పాలనలో తీవ్రంగా దిగజారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో అమలైన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి అనేక సంక్షేమ పథకాలను నిలిపివేసి నేతన్నలను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ చేనేత కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని ఆరోపించారు.

## పెట్టుబడులకు తెలంగాణే ఫస్ట్ ఛాయిస్ కావాలి

- ఎన్నారైలకు భట్టి విక్రమార్క పిలుపు
- శాన్ ఫ్రాన్సిస్కోలో డిప్యూటీ సీఎం పర్యటన



2లో..

## జీహెచ్ఎంసీ ఎన్నికల్లో భాజపా ఒంటరిగా పోటీ



**హైదరాబాద్, ఆగస్టు 07, అనంతజనశక్తి న్యూస్**

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తులు ఉండవని భాజపా తెలంగాణ చీఫ్ రామచందర్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని.. భేదాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయన్నారు. దిల్లీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో భేటీ అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. 2లో..

**రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**

**ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తులు ఉండవు**

**రాష్ట్రంలో పార్టీ నేతల మధ్య విభేదాలు లేవు**

**బేదాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయి**

## డీఎస్సీ నిరసనలపై దాడులు దారుణం

- జెన్ జీ గొంతును మూయలేరు
- ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం
- మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి
- న్యాయం జరిగే దాకా పోరాటం ఆగదు

2లో..



# పెట్టుబడులకు తెలంగాణే ఫస్ట్ ఛాయిస్ కావాలి



**హైదరాబాద్, ఆగస్టు 07, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణ రాష్ట్రాన్ని తమ పెట్టుబడులు, వ్యాపార విస్తరణకు తొలి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పారిశ్రామికవేత్తలు, ప్రవాస భారతీయులకు పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనలో భాగంగా శాన్ ఫ్రాన్సిస్కోలో భారత కాన్సుల్ జనరల్ కె. శ్రీకర్ రెడ్డి ఏర్పాటు చేసిన ప్రత్యేక విందు సమావేశంలో ఆయన మాట్లాడారు. బే ఏరియాలోని ఐటీ, వైద్యం, మానవ వనరుల రంగాలకు చెందిన ప్రముఖ ఎన్నారైలు, వ్యాపార నాయకులు హాజరైన ఈ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వ ప్రగతిశీల విధానాలు, భవిష్యత్ ప్రణాళికలను డిప్యూటీ సీఎం సుదీర్ఘంగా వివరించారు. హైదరాబాద్ నగరం టెక్నాలజీ, ఇన్నోవేషన్, లైఫ్ సైన్సెస్, గ్లోబల్ సర్వీసెస్ రంగాల్లో భారతదేశంలోనే అగ్రగామి కేంద్రంగా ఎదుగుతోందని ఆయన గుర్తుచేశారు. పారదర్శక పరిపాలన, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అత్యుత్తమ మౌలిక సదుపాయాలతో ప్రభుత్వం పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తోందని తెలిపారు. నూతన ఆలోచనలను వ్యాపారాలుగా మార్చడంలోనూ, నాణ్యమైన ఉపాధి కల్పనలోనూ పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి అడుగులు వేయాలని ఆహ్వానించారు. రాష్ట్రంలో చేపడుతున్న కీలక ప్రాజెక్టుల గురించి వివరిస్తూ.. మూసీ నది పునరుద్ధరణ, సమగ్ర పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు భట్టి విక్రమార్క చెప్పారు. తెలంగాణ యువతను అంతర్జాతీయ స్థాయి పోటీకి సన్నద్ధం చేసేందుకు ప్రతిష్ఠాత్మక యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు అత్యాధునిక నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అంతకుముందు మాట్లాడిన కాన్సుల్ జనరల్ శ్రీకర్ రెడ్డి.. ప్రవాస భారతీయులు, ప్రభుత్వాల మధ్య భాగస్వామ్యాలు బలోపేతం కావాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ సమావేశంలో సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఐఓసీ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెట్టుబడులు, సాంకేతిక సహకారం, నైపుణ్యాభివృద్ధిపై ఎన్నారై ప్రతినిధులతో నిర్వహించిన ఈ చర్చలు ఎంతో అర్థవంతంగా సాగాయి.

# డీఎస్సీ నిరసనలపై దాడులు దారుణం

**అమరావతి, ఆగస్టు 07, అనంతజనశక్తి న్యూస్**

డీఎస్సీ-2025 నియామకాల అంశంపై రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న నిరసనల సందర్భంగా దీక్షా శిబిరాలపై జరిగిన దాడులను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసనలు చేపడుతున్న నిరుద్యోగ యువతపై అధికార పార్టీ శ్రేణులు దాడులకు పాల్పడడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించిన జగన్, "ఆంధ్రప్రదేశ్ Gen Z గొంతును మూయలేరు.. న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదు" అంటూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. డీఎస్సీ-2025 ప్రశ్నాపత్రం లీక్, నియామకాల్లో జరిగిన అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని శాంతియుతంగా డిమాండ్ చేస్తుంటే, దానికి ప్రభుత్వం హింసతో సమాధానం ఇస్తోందని ఆరోపించారు.

విజయవాడలో రిలే నిరాహార దీక్ష నిర్వహిస్తున్న శిబిరంపై అధికార పార్టీ ఎమ్మెల్యే అనుచరులు దాడి చేసి టెంట్లను ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో పాటు నిరుద్యోగ యువతపై రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారని, మహిళలపై కూడా దాడులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ ఘటనలు పోలీసుల సమక్షంలోనే జరిగాయని విమర్శించారు. చిలకలూరిపేట, కనిగిరి, యాడికి, తాడిపత్రి, పలమనేరు, రేపల్లె, గుంటూరు, పొన్నూరు, వేమూరు, మాచర్ల, గురజాల, కందుకూరు, బాపట్ల తదితర ప్రాంతాల్లో నిరసన శిబిరాలపై దాడులు జరిగాయని, పలువురు నాయకులను పోలీసులు నిర్బంధించారని జగన్ అన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కూడా ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు.

డీఎస్సీ-2025 నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరిగిందని ప్రభుత్వం చెబుతున్నట్లయితే, సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతోందని జగన్ ప్రశ్నించారు. నియామకాల్లో జరిగిన అక్రమాలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రూ.9,000 కోట్లకు చేరిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతిని, గత రెండేళ్ల బకాయిలతో సహా వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరాలను ధ్వంసం చేయవచ్చని, నిరసనకారులను అరెస్టు చేయవచ్చని, కానీ డీఎస్సీ లీకేజీ, నియామక అక్రమాలపై ఉన్న ఆధారాలను చెరిపేయలేరని జగన్ వ్యాఖ్యానించారు. నిరుద్యోగ యువతలో ఉన్న ఆగ్రహాన్ని అణచివేయడం సాధ్యం కాదని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్..



# ఎన్ని అవమానాలైనా నేను భరిస్తా

**(మొదటి పేజీ తరువాయి)**

అసెంబ్లీ వేదికగా డీఎంకే నాయకుడు ఉదయనిధి స్టాలిన్ మాట్లాడే సమయంలో ప్రస్తుత టీవీకే ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని తీవ్ర చేశారు. కర్ణాటక రాష్ట్రం కావేరీ జలాల విషయంలో అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి తన ఐక్యతను నిరూపించుకుందని.. కానీ తమిళనాడులోని విజయ్ ప్రభుత్వం మాత్రం అఖిలపక్ష భేటీని నిర్వహించడానికి వెనకాడుతోందని ఆరోపించారు. మేకెదాటు వద్ద ఆనకట్ట నిర్మించకుండా అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ఈ సున్నితమైన సమస్యను చర్చించేందుకు ముఖ్యమంత్రి నేరుగా బెంగళూరు వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు.

**అనుమతులిచ్చింది మీరేనంటూ కౌంటర్**

ప్రతిపక్ష నేత వ్యాఖ్యలపై తక్షణమే స్పందించిన ముఖ్యమంత్రి విజయ్.. డీఎంకే విమర్శల్లోని లోపాలను ఎత్తిచూపారు. మేకెదాటు ప్రాజెక్ట్ నిర్మాణాత్మక ప్రతిపాదనలను తమ ప్రభుత్వం మొదటి నుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించామని, స్వయంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీకి కూడా విజ్ఞప్తి లేఖ రాశామని సభ దృష్టికి తెచ్చారు. అలాగే 1969వ సంవత్సరంలో మేకెదాటు ప్రాజెక్ట్‌కు ప్రాథమికంగా అనుమతులు మంజూరు చేసింది నాటి డీఎంకే ప్రభుత్వమేనని సభలో గుర్తు చేసి ఉదయనిధికి ఊహించని షాక్ ఇచ్చారు.



**ప్రజల కోసం అవమానాలకైనా సిద్ధం!**

తన బెంగళూరు పర్యటనను గట్టిగా సమర్థించుకున్న సీఎం విజయ్ అత్యంత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయంగా తీవ్ర శత్రుత్వమున్న దేశాలు కూడా శాంతి, సమస్యల పరిష్కారం కోసం చర్చల వేదికను ఆశ్రయిస్తున్నప్పుడు.. మన పొరుగు రాష్ట్రంతో మాట్లాడటంలో తప్పేమీ లేదని అన్నారు. ఈ ప్రయత్నాల్లో ఏవైనా అవమానాలు ఎదురైతే ఏంటని కొందరు తనను ప్రశ్నిస్తున్నారని.. అయితే తమిళనాడు రాష్ట్ర ప్రజల హక్కులు, ప్రయోజనాల కాపాడుకోవడానికి తాను ఎలాంటి అవమానానైనా భరించడానికి సిద్ధంగా ఉన్నానని సీఎం స్పష్టం చేశారు. దీంతో సభలో ఒక్కసారిగా కొద్దిసేపు నిశ్శబ్దం ఆవహించింది.

# జీహెచ్ఎంసీ ఎన్నికల్లో భాజపా ఒంటరిగా పోటీ

**మొదటిపేజీ తరువాయి**

"తెలంగాణలో భాజపా ఎవరితోనూ పొత్తులు పెట్టుకోదు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం. కీలక నేతలు మా పార్టీలో చేరేందుకు సమయం కోసం వేచి చూస్తున్నారు. భాజపాలో కొత్త, పాత నేతలు అనే తేడా లేదు. తెలంగాణ ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయింది. అందరూ కలిసి పోరాటం చేయాలని నితిన్ నబీన్ దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి రోడ్ మ్యాప్ తయారు చేయాలని ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత మరోసారి ఎంపీ, ఎమ్మెల్యేలతో సమావేశం జరుగుతుంది. 937 మండలాలలో పార్టీని బలోపేతం చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, ఆరు గ్యారంటీలపై పోరాటం చేస్తాం" అని రామచందర్‌రావు తెలిపారు.

# ఆందోళన వద్దు.. మీకు నేను ఉన్నాను

**(మొదటిపేజీ తరువాయి)**

'ఇది కొత్తవారికి అన్యాయం చేయడం లాంటిదే' అని వ్యాఖ్యానించి మోదీ.. సభా కార్యకలాపాలు సజావుగా, సాఫీగా సాగాలని ఉద్ఘాటించారు. అలాగే, పార్లమెంట్ చరిత్రను చదవాలని, అధ్యయనం చేసిన అర్థం చేసుకోవాలని కొత్త ఎంపీలకు ప్రధాని సూచించారు. "పార్లమెంట్‌లో ఎంతో చారిత్రక సమాచారం అందుబాటులో ఉంది.. చర్చలకు సిద్ధమయ్యేందుకు దాన్ని ఉపయోగించుకోండి. మీ మీ రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేయండి.. రాష్ట్రాలు పురోగమించినప్పుడే దేశం పురోగమిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.

మోదీతో బ్రేక్‌ఫాస్ట్ భేటీలో షిండే వర్గంలో చేరి శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు, నేషనల్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో చేరిన తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది రెబల్స్, ఎన్సీపీ (అజిత్ పవార్)కి చెందిన ఇద్దరు సహా 45 మంది లోక్‌సభ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా టీఎంసీ, శివసేన రెబల్ ఎంపీలకు ఎలాంటి ఆందోళన చెందవద్దని, మీకు తాను ఉన్నానంటూ ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు.

**నేను మీకున్నా.. మోదీ**

"ఎన్డీఏ ఒక కుటుంబం. మేము భాగస్వామ్య పార్టీలతో ఉన్నాం... ప్రతి వ్యక్తికి గౌరవం దక్కుతుంది.. ప్రతి ఒక్కరికీ అవకాశం వస్తుంది. నేను కేవలం ఎన్డీఏలోని ఒక భాగస్వామ్య పార్టీతోనే కాదు, ప్రతి ఎంపీతోనూ ఉన్నాను. నేను ఎన్డీఏలోని ప్రతి ఎంపీకి అండగా నిలుస్తాను. మీరు ఎవరి గురించీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు" అని ఆయన అన్నారు.

తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లేందుకు తమ అధికారాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ప్రధాని వారిని కోరారు. "మీ ప్రాంతంలో ఏ అభివృద్ధి పని కోసమైనా నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని సంప్రదించండి... పేదలు, కార్మికులు, రైతులతో సహా అందరినీ కలవండి, ప్రతి ఒక్కరి సమస్యలను అర్థం చేసుకోండి" అని ఆయన పేర్కొన్నారు. అనంతరం ప్రతి ఎంపీతో వ్యక్తిగతంగా మాట్లాడిన మోదీ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

**బీజేపీ ఎంపీలతో భేటీ**

వర్షాకాల సమావేశాల సందర్భంగా పార్లమెంట్ సభ్యులతో సంప్రదింపులలో భాగంగా ప్రధాని మోదీ తన అధికారిక నివాసంలో 37 మంది బీజేపీ ఎంపీలతో విందు సమావేశం నిర్వహించిన మర్నాడే బ్రేక్‌ఫాస్ట్ భేటీ జరిగింది. పాలన, పార్లమెంటరీ వ్యవహారాలపై అభిప్రాయాలను పంచుకోవడంతో పాటు అలాగే పార్టీలో సమన్వయాన్ని బలోపేతం చేసేందుకు ఈ అనధికారిక భేటీ జరిగింది. ఎంపీలతో తన వ్యక్తిగత అనుభవాలను పంచుకోవడంతో పాటు పలు అంశాలపై ప్రధాని చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఎంపీలు 'ఢిల్లీ రాజకీయ కథనాల వలలో' చిక్కుకోవద్దని, అలాగే ప్రతిపక్ష సభ్యులతో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించాలని వారికి ప్రధాని మోదీ సూచించారు.



# ఉభయ సభలకు హాజరుకావాల్సిందే..



**(మొదటిపేజీతరువాయి)**

ఈ సందర్భంగా 2026 ఆగస్టు 10, 11, 12 తేదీల్లో రాజ్యసభలో చాలా ముఖ్యమైన అంశాలను చర్చకు తీసుకోనున్నట్లు జైరామ్ రమేశ్ తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి సభ వాయిదా పడే వరకు తప్పనిసరిగా సభలో సభ్యులు ఉండాలని, పార్టీ వైఖరికి మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని అత్యంత ముఖ్యమైనదిగా పరిగణించాలని కోరారు. మరోవైపు, లోక్‌సభలోని కాంగ్రెస్ సభ్యులకూ పార్టీ ఇదే విధమైన విప్ జారీ చేసింది. ఆ మూడు రోజుల పాటు కాంగ్రెస్ ఎంపీలంతా తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొంది. అదేవిధంగా ఇండియా కూటమిలోని అన్ని మిత్రపక్షాలకు ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆయా పార్టీల ఎంపీలందరూ హాజరుకావాలని కోరింది. కాగా, ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ తరుణంలో కాంగ్రెస్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే, వచ్చే వారం జరగబోయే తాత్కాలిక ప్రభుత్వ కార్యకలాపాల జాబితాను పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి వెల్లడించారు.

# ప్రతి భారతీయుడూ.. చేనేతకు అండగా నిలవాలి






**న్యూఢిల్లీ, ఆగస్టు 07, అనంత జనశక్తి న్యూస్**

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేత కార్మికులు, కళాకారులందరికీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలియజేశారు. భారతదేశపు గొప్ప నేత వారసత్వాన్ని సజీవంగా ఉంచుతున్న నైపుణ్యం గల చేతులను గౌరవిద్దామని అన్నారు. ప్రతి చేనేత వస్త్రం మన సంస్కృతిని, చేతిపనితనాన్ని, స్వావలంబన స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందన్నారు. చేనేతను ఎంచుకోవడం ద్వారా, దేశ సంప్రదాయాలను పరిరక్షించుకోవడంతో పాటు నేత కార్మికుల జీవనోపాధిని బలోపేతం చేస్తామని చెప్పుకొచ్చారు. తాను చేనేతకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం గర్వకారణమన్నారు.

చేనేత రంగాన్ని ప్రోత్సహించడానికి, పరిరక్షించడానికి, సాధికారత కల్పించడానికి జనసేన పార్టీ తన సంస్థాగత నిర్మాణంలో ప్రత్యేకంగా నేత కార్మికుల అభివృద్ధి విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు పవన్ తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని పవన్ పేర్కొన్నారు. అర్హులైన నేత కార్మికులకు ఉచిత విద్యుత్, రూ.25,000 సహాయం అందించే 'నేతన్న సేవలో' పథకంతో సహా అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భారతదేశపు అమూల్యమైన చేనేత వారసత్వాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని వివరించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక వీడియో సందేశాన్ని కూడా డిప్యూటీ సీఎం ప్రస్తావించారు. ప్రతి భారతీయుడిని ముఖ్యంగా యువతను, కంటెంట్ క్రియేటర్లు చేనేత వస్త్రాలను ధరించి GRWM (గెట్ రెడీ విత్ మీ) వీడియోలను రూపొందించడం ద్వారా చేనేతకు ప్రాచుర్యం కల్పించాలని ప్రధాని పిలుపునిచ్చారని తెలిపారు. ప్రతి భారతీయుడు చేనేతను దైనందిన జీవితంలో భాగంగా మార్చుకుని నేత కార్మికులకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. భారతదేశ వారసత్వాన్ని కాపాడుకుందామని.. దేశానికి గుర్తింపు తీసుకొస్తున్న నేత కార్మికులకు సాధికారత కల్పిద్దామని ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

# మంత్రి నారా లోకేశ్‌పై ప్రధాని మోదీ ప్రశంసలు

**అమరావతి, ఆగస్టు 07, అనంతజనశక్తి న్యూస్**

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. విజయనగరం చేనేత కార్మికులు రూపొందించిన ప్రత్యేక వస్త్రాలను ప్రధానికి కానుకగా ఆయన అందజేశారు. ఈ సందర్భంగా చేనేత కళాకారుల నైపుణ్యాన్ని, వారి సేవలను మోదీ అభినందించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమం ప్రస్తావనకు వచ్చింది. ఆ కార్యక్రమం ఎంతో అద్భుతంగా నిర్వహించారని ప్రధాని ప్రశంసించారు. అలాగే ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ప్రత్యేకంగా అభినందించారు ప్రధాని. మంత్రి లోకేశ్‌కు ఆర్గనైజేషన్ స్కిల్స్ బాగున్నాయని ఆయన కితాబిచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు క్రమశిక్షణను కూడా మోదీ కొనియాడారు. సమావేశాల సమయంలో ఎంపీ కలిశెట్టి రోజూ పార్లమెంట్‌కు సైకిల్‌పై వస్తుండటాన్ని తాను గమనించానని, ప్రజాప్రతినిధిగా ఆయన క్రమశిక్షణ కలిగిన నాయకుడని అభినందించారు. ఈ భేటీలో ఎంపీ కుమార్తె కలిశెట్టి నిఖిల కూడా పాల్గొన్నారు. ప్రధాని పాలనను భారత్‌తో పాటు విదేశాల్లోని జెన్‌జీ తరం గర్వంగా భావిస్తోందని ఆమె తెలిపారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన పట్ల ప్రజలు ఎంతో సంతృప్తిగా ఉన్నారని నిఖిల చెప్పగా.. ఆమె మాటలతో ప్రధాని మోదీ ఏకీభవించారు. వారి భేటీ సందర్భంగా జాతీయ చేనేత దినోత్సవం నేపథ్యంలో దేశ ప్రజలు, చేనేత కార్మికులకు ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి శుభాకాంక్షలు తెలిపారు.



# చేనేతకు పూర్వ వైభవం తీసుకొస్తాం

**అమరావతి, ఆగస్టు 07, అనంత జనశక్తి న్యూస్**

చేనేత కుటుంబాలతో కలిసి జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా 'నేతన్న సేవలో' పథకానికి శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం వేటపాలెం మండలం కొత్తపేటలో జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. చీరాలకు రావడం తన అదృష్టమన్నారు. అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం అందజేస్తున్నామని.. మొత్తం 71,636 చేనేత కుటుంబాలకు పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. రూ.179 కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని తెలిపారు.

చేనేత కార్మికులంటే తనకు ప్రత్యేక అభిమానమని సీఎం అన్నారు. చేనేత కార్మికుల కష్టాలు తనకు తెలుసని.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే చేనేత కోసం పోరాడామని గుర్తుచేశారు. చేనేత కేవలం వృత్తి కాదని.. భారతీయ సంస్కృతికి ప్రతీక అని తెలిపారు. దేశం గర్వించే కళ చేనేత అని అభివర్ణించారు. చీరాల చేనేతకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని.. చీరాల పట్టు, కాటన్ చీరలకు విశేష ఆదరణ లభిస్తోందని తెలిపారు. ఒకప్పుడు చీరాల కర్చీఫ్‌లు విదేశాలకు ఎగుమతి అయ్యేవని చెప్పుకొచ్చారు. చేనేత రంగం కాలక్రమేణా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొందని తెలిపారు. చేనేతను ప్రోత్సహిస్తూ జీవన ప్రమాణాలు పెంచుతామన్నారు. చీరాల, వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ, శ్రీకాకుళం, మంగళగిరి, పొందూరు, పెడన, నరసాపురం చేనేత ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. చేనేత వైభవాన్ని మళ్లీ తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం...**

సుమారు 1,27,000 మంది చేనేత మీద ఆధారపడ్డారని ముఖ్యమంత్రి వెల్లడించారు. చాలా వృత్తులను చూశానని.. చేనేత పైనే ఆధారపడిన ఏకైక వర్గం చేనేత కార్మికులన్నారు. మగ్గాన్నే నమ్ముకున్న ఏకైక వర్గం చేనేత అని అన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఎక్కువ కన్సర్న్ చూపించిన వర్గం చేనేత అని.. ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా ఎప్పుడూ చేనేత కార్మికులు తెలుగుదేశం పార్టీకే ఓటు వేశారన్నారు. ఎన్నికలకు ముందు 200 రూపాయలు హ్యాండ్లూమ్‌కి, 500 యూనిట్లు పవర్‌లూమ్‌కి సబ్సిడీ ఇస్తానని చెప్పానని.. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు.

**చేనేతలకు పెన్షన్ ఇచ్చిన తొలి ప్రభుత్వం మాదే...**

చేనేత కార్మికులు మగ్గం దగ్గర కూర్చొని అందులో వచ్చి కాటన్ అంతా కూడా కడుపులోకిపోయి అనారోగ్యం పాలవుతున్నారనే ఉద్దేశంతో 50 సంవత్సరాలకే పెన్షన్ ఇచ్చామని తెలిపారు. 50 ఏళ్లకే చేనేత కార్మికులకు పెన్షన్ ఇచ్చిన తొలి ప్రభుత్వం తమదే అని అన్నారు. 85 వేల మంది చేనేత కార్మికులకు పెన్షన్లు అందిస్తున్నామని.. పెన్షన్‌ను రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు పెంచామని తెలిపారు. చేనేత పెన్షన్ల కోసం ఏడాదికి రూ.420 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. 109 చేనేత సహకార సంఘాలకు రూ.79 కోట్ల క్యాష్ క్రెడిట్ ఇస్తున్నామని, 10 చేనేత క్లస్టర్ల అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. చేనేత మార్కెటింగ్‌కు ప్రత్యేక సహాయ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు ఏర్పాటు చేశామని, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్క్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.

**ఎన్డీఏ విజయానికి బీసీలే కారణం..**


45 ఏళ్లుగా టీడీపీకి బీసీలు వెన్నెముకగా నిలిచారని ముఖ్యమంత్రి అన్నారు. ఎన్డీఏ విజయానికి బీసీలే ప్రధాన కారణమన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని.. సూపర్ సిక్స్ హామీల అమలులో ప్రభుత్వం ముందుకెళ్తోందని వెల్లడించారు. ప్రజలకు ఇబ్బంది లేని పరిపాలన అందిస్తున్నామన్నారు. నేతన్న సేవలో కింద రూ.25 వేల ఆర్థిక సాయం, తల్లికి వందనం ద్వారా ఇద్దరు పిల్లలుంటే రూ.30 వేల లబ్ధి, మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేశామని అన్నారు. డీఎస్సీ ద్వారా 16 వేల ఉద్యోగాలకు తొలి సంతకంతో హామీ నెరవేర్చామని, 1.34 లక్షల మత్స్యకారులకు రూ.505 కోట్ల ఆర్థిక సాయం అందజేసినట్లు వెల్లడించారు. వడ్డెర్లకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10% వాటా, 3 కిలోవాట్ల సోలార్ రూఫ్‌టాప్‌కు రూ.98 వేల సబ్సిడీ, కేంద్రం నుంచి రూ.78 వేలు, రాష్ట్రం నుంచి అదనంగా రూ.20 వేలు సబ్సిడీ అందజేస్తున్నట్లు తెలిపారు. వెనుకబడిన వర్గాల రుణం తీర్చుకోవడం ఎన్డీఏ ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

**అభివృద్ధిపైనా శ్రద్ధ..**

చేపల వేట నిషేధ సమయంలో 1.34 లక్షల మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున రూ.505 కోట్లు ఇచ్చామని చంద్రబాబు తెలిపారు. బీసీల కోసం రక్షణ చట్టం తీసుకువస్తున్నామని.. దీని ముసాయిదా సిద్ధమైందన్నారు. రాష్ట్రంలో అందరికీ రూ.2.5 లక్షల చొప్పున యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తున్నామని వెల్లడించారు.

# జెన్‌జీ నిరసన దేశ వ్యతిరేకం కాదు

**- వారి ఆందోళనలో నిజాయితీ ఉంది**
**- ప్రసంగించటం, ఎన్నికలు గెలవటమే నాయకత్వం కాదు**



అసమానతలున్నన్ని రోజులు రిజర్వేషన్లుంటాయి నవతరం భేటీలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్

నవతరం (జెన్ జీ) మనోవేదన నిజమైనదేనని, వారి ఆందోళనలో నిజాయితీ ఉందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ కితాబిచ్చారు. నిరసన తెలిపేందుకు, అధికారాన్ని ప్రశ్నించేందుకు, సంస్కరణలు కోరేందుకు విద్యార్థులకు హక్కు ఉందన్నారు. జెన్‌జీ నిరసనలు నిర్వహించకూడదని తాను ఎన్నటికీ అనబోనని స్పష్టంచేశారు. వారి ఉద్యమాన్ని దేశ వ్యతిరేక కార్యకలాపంగా ముద్రవేయడం సరికాదని హెచ్చరించారు. జంతర్ మంతర్‌లో పోలీసులకు, నిరసనకారులకు మధ్య వివాదం ఏ విధంగా తలెత్తిందో కానీ యువతరంపై తన విశ్వాసం అచంచలమైనదని భాగవత్ స్పష్టం చేశారు. గురువారం ఇండియాస్ ఇంటర్నేషనల్ మూవ్‌మెంట్ టు యునైట్ నేషన్స్ (ఐఐఎంయూఎన్) సంస్థ 15వ వార్షికోత్సవ సభలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా దాదాపు రెండువేల మంది జెన్‌జీ, జెన్ ఆల్ఫా ప్రతినిధులతో ఆరెస్సెస్ చీఫ్ సంభాషించారు. వివిధ అంశాలపై ఆయన ఏమన్నారంటే...

**నిరసన కూడా చర్చలో భాగమే**

''దేశ యువత ఆశలు ఆకాంక్షలపై నాకు విశ్వాసముంది. పూర్వపు తరాల్లో అధికారాన్ని ప్రశ్నించే తత్వం లేదు. అయితే జెన్‌జీ తీరు వేరు. ఈ తరం ప్రశ్నలు అడిగి వాటికి హేతుబద్ధమైన సమాధానాలు కోరుతుంది. ప్రజాస్వామ్యంలో నిరసన కూడా న్యాయమైన చర్చలో భాగమే. అయితే నిరసన ఏకాభిప్రాయాన్ని నిర్మించే దిశగా ఉండాలే తప్ప విభజనలు సృష్టించరాదు. ప్రజల ఆందోళన స్వరాన్ని వినడానికి నిరాకరిస్తే జనం ఉద్యమం వైపు మళ్లుతారు. ఈ యావత్ ప్రక్రియ లక్ష్యం ఏకాభిప్రాయాన్ని సాధించడమే తప్ప విభజనలు సృష్టించడం కాదు.

నాయకత్వం అంటే ఉపన్యాసాలు దంచడం కాదు
నిజమైన నాయకత్వం అంటే ఉపన్యాసాలు దంచడం, ఎన్నికలు గెలవడం, ప్రజలకు హితబోధలు చేయడం కాదు. విజయాన్ని, ప్రఖ్యాతిని అందరితో పంచుకోవడమే నిజమైన నాయకత్వ లక్షణం.

ఎల్‌జీబీటీఏఐ సముదాయం సమాజంలో భాగమే
ప్రత్యేక లైంగిక ప్రవృత్తి కలిగిన ఎల్‌జీబీటీక్యూఏఐ సముదాయం కూడా మన సమాజంలో భాగమే. అయితే వారి కోసం వివాహ వ్యవస్థలో మార్పులు తేవడం అవాంఛిత దుష్పరిణామాలకు దారి తీస్తుంది. చట్టపరంగా స్వలింగ జంటలకు ప్రత్యేకమైన ఏర్పాటు ఉండాలి.

**రిజర్వేషన్లు శాశ్వతం కాదు**

వెనుకబడిన వర్గాల ఉద్ధరణ కోసం ఉద్దేశించినవే రిజర్వేషన్లు! అవి శాశ్వతం కాదు. విద్య, ఉద్యోగ అవకాశాల్లో వివక్షకు గురైన వెనుకబడిన వర్గాల ప్రయోజనం కోసమే రిజర్వేషన్లు. అసమానతలు ఉన్నంతకాలం అవి కొనసాగుతాయి. వీటి వల్ల పురోగతి సాధించిన వారు ఇతరులకూ అలాంటి లబ్ధి చేకూరేందుకు వీలుగా రిజర్వేషన్ ప్రయోజనం వదులుకునే విషయం ఆలోచించాలి''.

# 'కావేరీ' విషయంలో.. ఎన్ని అవమానాలకైనా సిద్ధమే: విజయ్



కావేరీ జలాల వివాదంపై తమిళనాడు శాసనసభ సమావేశాల్లో వాడీవేడీ చర్చ జరిగింది. ఈ వ్యవహారంపై ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన ఆరోపణలకు ముఖ్యమంత్రి విజయ్ దీటుగా బదులిచ్చారు. 'కావేరీ' సమస్య పరిష్కారానికి కర్ణాటక ప్రభుత్వంతో చర్చలను తానే ప్రతిపాదించానన్న సీఎం.. తమిళనాడు ప్రజల కోసం ఎన్ని అవమానాలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని తెలిపారు.

తమిళనాడు అసెంబ్లీ సమావేశాల్లో డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ విజయ్ సర్కారుపై విమర్శలు గుప్పించారు. ''మేకెదాటు ప్రాజెక్ట్ చేపట్టకుండా కర్ణాటకను ఆపేందుకు ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందో చెప్పాలి. కావేరీ వివాదంపై మన పొరుగు రాష్ట్రం అఖిలపక్ష సమావేశం నిర్వహించి ఐకమత్యాన్ని చాటింది. కానీ, టీవీకే ప్రభుత్వం మాత్రం అఖిలపక్ష సమావేశానికి నిరాకరిస్తోంది. ఇక, మేకెదాటు గురించి చర్చించేందుకు మన సీఎం బెంగళూరుకు వెళ్లాల్సిన అవసరం ఏముంది?'' అని ఉదయనిధి ప్రశ్నించారు.

దీనికి సీఎం విజయ్ స్పందిస్తూ.. మేకెదాటు ప్రాజెక్ట్ నిర్మాణానికి వ్యతిరేకంగా తమ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించినట్లు తెలిపారు. దీనిపై ఇప్పటికే ప్రధాని మోదీకి లేఖ రాసిన విషయాన్ని గుర్తుచేశారు. 1969లో ఈ ప్రాజెక్ట్‌కు మొదట అనుమతినిచ్చింది డీఎంకే ప్రభుత్వమేనంటూ ఉదయనిధి విమర్శలకు దీటుగా బదులిచ్చారు. ఇక, బెంగళూరు పర్యటనను కూడా విజయ్ సమర్థించుకున్నారు.

''శత్రు దేశాలే తమ సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. అలాంటప్పుడు మన సమస్య పరిష్కారం కోసం పొరుగు రాష్ట్రానికి వెళ్తే తప్పేంటి? ఈ ప్రయత్నంతో మనం అవమానానికి గురైతే పరిస్థితి ఏంటని కొందరు నన్ను ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ అదే జరిగితే.. తమిళనాడు ప్రజల ప్రయోజనాల కోసం ఎన్ని అవమానాలు ఎదుర్కొనేందుకైనా నేను సిద్ధమే'' అని విజయ్ స్పష్టం చేశారు.



# కోడిగుడ్లకే భయమా..? ఎంపీ మహువాపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాకు సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. విద్వేష ప్రసంగం కేసులో పోలీసుల ఎదుట విచారణకు హాజరవ్వాలని కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. విచారణకు వెళ్తే తనపై కోడిగుడ్లతో దాడి చేస్తారని మహువా చేసిన ఆందోళనలను సుప్రీం ధర్మాసనం తోసిపుచ్చింది. ఓ ఎంపీగా ఉన్న వ్యక్తి కోడిగుడ్లకు భయపడుతారా? అని వ్యాఖ్యానించింది.

ఎంపీ మహువా మొయిత్రా దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగులతో కూడి సుప్రీంకోర్టు ధర్మాసనం.. కలకత్తా హైకోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని చెప్పింది. అయితే, పోలీసుల నోటీసు ప్రకారం తన నియోజకవర్గంలోని స్టేషన్‌కు వెళ్లాల్సి ఉందని, గతంలో అక్కడ పర్యటించిన సందర్భంలో కోడిగుడ్లతో దాడి జరిగిందని పిటిషనర్ తరఫు న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణన్ న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. అందుకే వర్చువల్‌గా హాజరయ్యేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అయినప్పటికీ, ఈ విషయంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. ''మీరు పార్లమెంట్ సభ్యులు. రాజకీయాల్లోకి అడుగు పెట్టాక.. మీకు గుడ్లంటే భయమా? మన స్వాతంత్ర్య సమరయోధులు తూటాలకు కూడా భయపడలేదు. అటువంటప్పుడు ఇలాంటి విజ్ఞప్తులు అసలు కోర్టు ముందుకే రాకూడదు'' అని మౌఖిక వ్యాఖ్యలు చేసింది. దీంతో న్యాయవాది తన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.

# విడాకుల కేసు వెనక్కి తీసుకున్న సీఎం విజయ్ సతీమణి



తమిళనాడు సీఎం విజయ్( విడాకుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. విజయ్ నుంచి విడాకులు కోరుతూ కోర్టులో వేసిన పిటిషన్‌ను ఆయన భార్య సంగీత వెనక్కి తీసుకున్నారు. నేడు ఈ కేసు విచారణకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన సంగీత.. తన కేసును కొనసాగించకపోవడానికి గల కారణాలను న్యాయస్థానానికి వివరించారు. దీంతో ఈ కేసును ముగిస్తున్నట్లు చెంగల్‌పట్టు జిల్లా కోర్టు ప్రకటించింది. అవసరమైతే భవిష్యత్తులో కొత్త పిటిషన్‌ను దాఖలు చేసే స్వేచ్ఛను ఆమెకు కల్పించింది. విజయ్‌పై పలు ఆరోపణలు చేస్తూ ఆయన సతీమణి సంగీత విడాకులు కోరుతూ ఫిబ్రవరిలో చెంగల్‌పట్టు కోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై విచారణకు ఇరువురూ హాజరు కాకపోవడంతో కోర్టు పలుమార్లు విచారణను వాయిదా వేసింది. ఆ సందర్భాల్లో వారి తరఫు న్యాయవాదులు హాజరై.. విచారణకు ప్రత్యక్షంగా హాజరుకావడంలో నెలకొన్న ఇబ్బందులను కోర్టుకు వివరించారు. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ జరుగుతూ వచ్చింది. విజయ్‌కు 1999 ఆగస్టు 25న సంగీతతో వివాహం జరగ్గా.. వారికి కుమారుడు, కుమార్తె ఉన్న విషయం తెలిసిందే.



# ఆందోళన వద్దు.. మీకు నేనున్నా: ఎంపీలతో మోదీ

ఎన్డీఏలో ఇటీవల చేరిన ఎంపీలకు ప్రధాని మోదీ పలు కీలక సూచనలు చేశారు. శుక్రవారం పార్లమెంట్ సమావేశాలకు ముందు అల్పాహారం సందర్భంగా 45 మంది ఎంపీలతో దాదాపు గంట పాటు సమావేశమయ్యారు. శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) నుంచి ఏక్‌నాథ్ శిందే వర్గంలో చేరిన ఎంపీలు, తృణమూల్ రెబెల్స్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ.. ''కొత్త పార్టీ అని ఆందోళన చెందొద్దు. మీకు నేనున్నాను. ఎన్డీఏ కుటుంబంలో ప్రతి వ్యక్తికి గౌరవం, రాజకీయాల్లో అవకాశం ఇస్తాం'' అన్నారు. ఎన్డీఏలోని ప్రతి ఎంపీకి తన మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.

ఎంపీలు తమ రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేయాలని.. తద్వారా దేశం కూడా అభివృద్ధి చెందుతుందని మోదీ పేర్కొన్నారు. ఏ అభివృద్ధి పని కోసమైనా నేరుగా పీఎంఓను సంప్రదించవచ్చని సూచించారు. ప్రజలు, యువతకు నిరంతరం అందుబాటులో ఉంటూ.. వారి కోసం పని చేయాలని తెలిపారు. పార్లమెంట్‌ను 'ప్రజాస్వామ్యానికి సర్వోన్నత దేవాలయం'గా అభివర్ణించారు. దాని చరిత్రను తెలుసుకోవాలని సూచించారు. లోక్‌సభ చర్చల్లో చురుగ్గా పాల్గొనాలని.. ప్రతిపక్ష సభ్యులతో సత్సంబంధాలు కొనసాగించాలని పేర్కొన్నారు.

**అమ్మ ఎలా ఉన్నారు..?**

ఎంపీలు అందరినీ వ్యక్తిగతంగా పలకరించిన ప్రధాని.. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సునేత్రా పవార్ క్షేమ సమాచారం గురించి ఎంపీ పార్థ్ పవార్ (ఆమె కొడుకు)ను అడిగి తెలుసుకున్నారు. అమ్మను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. పార్థ్ పవార్ తండ్రి.. మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ఈ ఏడాది జనవరిలో విమాన ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. దాంతో ఆ స్థానంలో ఆయన సతీమణి సునేత్రా పవార్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు.

# వృద్ధాశ్రమంలో.. నాన్న చితి వీడియోకాల్‌లో కూతుళ్ల వీక్షణ



జీవితమంతా కష్టపడి ముగ్గురు కూతుళ్లను ప్రయోజకులను చేసిన ఓ తండ్రి వృద్ధాశ్రమంలో కన్ను మూశారు. ఆశ్రమ నిర్వాహకులు ఈ సమాచారం అందించినా.. రావడానికి సమయం లేదంటూ ఆ కుమార్తెలు తండ్రి దహన సంస్కారాలను వీడియో కాల్ ద్వారా చూశారు. పైగా ఆ ముగ్గురిలో ఒకరు.. ''ఇంకా ఎంతసేపు? మేము స్నానాలు చేసి భోజనం చేయాలి'' అంటూ అసహనం వ్యక్తం చేయడం గమనార్హం. మానవత్వాన్ని మంటగలుపుతున్న సమాజ పోకడలను తెలిపే ఈ దారుణం హరియాణాలోని సోనీపత్‌లో మంగళవారం జరిగింది. ముంబయికి చెందిన వస్త్ర వ్యాపారి శివచరణ్ తన భార్య మీనాతో కలిసి ఏడాదిన్నర క్రితం సోనీపత్ వృద్ధాశ్రమంలో చేరారు. మీనా కొంతకాలం కిందట మరణించగా, అప్పటినుంచి శివచరణ్ ఒక్కరే వృద్ధాశ్రమంలో ఉంటున్నారు. ఈ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె నేపాల్‌లో, రెండో కుమార్తె ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆజంగఢ్‌లో, చిన్న కుమార్తె ముంబయిలో ఉంటున్నారు. పెద్ద కుమార్తె ఆశ్రమ నిర్వాహకుడికి రూ.5,100 పంపి, నాన్న అంత్యక్రియలను జరపమని కోరింది.

''శివచరణ్ తన కుమార్తెలతో తరచూ ఫోనులో మాట్లాడేవారు. ఆయన అనారోగ్యానికి గురైన తర్వాత ఫోన్లు ఆగిపోయాయి. ఇరవై రోజుల క్రితం ఆరోగ్యం మరింత క్షీణించింది. కుమార్తెలకు సమాచారం అందించినా తండ్రిని చూడటానికి ఎవరూ రాలేదు'' అని ఆశ్రమ నిర్వాహకుడు ఆనంద్ తెలిపారు. పిల్లల కోసం జీవితాన్ని ధారబోసిన శివచరణ్ చివరకు తన కళ్లను కూడా సమాజానికి దానం చేశారు.

# ఆ నేరం తల్లిది కాదు.. సమాజానిదే!



ఆకలి అవుతోంది అన్నం పెట్టమని అడిగిన రెండేళ్ల కుమార్తె పొట్ట నింపలేని నిస్సహాయ స్థితిలో ఆ చిన్నారిని కొట్టి చంపిన తల్లికి బెయిల్ మంజూరు చేస్తూ అహ్మదాబాద్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఈ ఘటన హృదయ విదారకమైనది. ఆకలి ఆర్థిక సమస్య మాత్రమే కాదు. మనిషి గౌరవం, న్యాయం, మానసిక స్థితితోనూ ముడిపడిన అంశమ'ని పేర్కొంది. 'తీవ్రమైన క్షుద్బాధ కన్నబిడ్డను తన స్వహస్తాలతో చంపుకొనేంత వైపరీత్యానికి ఒక తల్లిని ఉసిగొల్పిందంటే...ఈ వైఫల్యం ఆమె ఒక్కరిదే కాదు. యావత్తు సమాజానిది కూడా..'అని జస్టిస్ హస్‌ముఖ్ డి.సుతార్ అభిప్రాయపడ్డారు. ప్రతి మనిషికీ కనీస అవసరాలైన ఆహారం, తలదాచుకునే ఇల్లు, ఆరోగ్య సంరక్షణ సమకూరాలని, గౌరవంగా బతికే అవకాశం ఉండాలని తెలిపారు. 'ఏ తల్లీ, బిడ్డా ఆకలి అనే అగౌరవానికి గురికాకూడదు అనే ప్రతిన బూనేందుకు ఇచ్చిన పిలుపుగా ఈ విషాధ ఘటనను చూడాలి. సామాజిక సంక్షేమ పథకాల వైఫల్యానికీ ఇది అద్దపడుతోంది' అని తెలిపారు. కుమార్తెను కొట్టి చంపిందనే నేరారోపణతో లఖిబెన్ సోలంకి అనే ముగ్గురు బిడ్డల తల్లిని ఈ ఏడాది మార్చిలో సూరత్ పోలీసులు అరెస్టు చేశారు. ఆమెకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేస్తూ న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు.

# ఏడు రోజుల్లో ముగిసిన ఏడడుగుల బంధం



ఏడు జన్మల బంధమంటూ అగ్నిసాక్షిగా ప్రమాణాలు చేసిన ఓ జంట పెళ్లి జరిగిన వారం రోజుల్లోనే కోర్టు మెట్లు ఎక్కింది. మధ్యప్రదేశ్‌లోని ఇండౌర్‌లో అత్తవారింట అడుగు పెట్టిన నవవధువు.. ఆ ఇల్లు తనకు నచ్చలేదని, మరో వ్యక్తిని ప్రేమించిన తాను కుటుంబసభ్యుల ఒత్తిడితోనే వివాహానికి అంగీకరించినట్లు చెప్పింది. దిగ్భ్రాంతికి గురైన అత్తింటివారు ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించి, వివాహబంధాన్ని రద్దు చేయాలని పిటిషను దాఖలు చేశారు. సాధారణంగా ఇటువంటి కేసుల్లో కౌన్సెలింగు, విచారణల ప్రక్రియ పూర్తవడానికి సమయం పడుతుంది. ఈ కేసులో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని గుర్తించిన కుటుంబ న్యాయస్థానం అత్యంత వేగంగా విచారణ చేపట్టి వారంలోనే విడాకులు మంజూరు చేసింది.

# బావిలో ఎగసిపడుతున్న అలలు.. గుజరాత్‌లో వింత ఘటన



గుజరాత్ లోని మోర్బిలో వింత ఘటన చోటుచేసుకుంది. వీర్‌పార్థ గ్రామంలోని ఓ బావిలో గత ఐదు రోజులుగా నీళ్లు భారీ అలలుగా ఎగసిపడుతున్నాయి . అటూ ఇటూ కదులుతూ.. బయటకు పొంగి పొర్లుతున్నాయి. ఈ విషయం స్థానికంగా చర్చనీయాంశం కావడంతో.. చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా ప్రజలు అక్కడికి వచ్చి చూస్తున్నారు. ఈ బావిని మూడు నెలల క్రితం తవ్వినట్లు వ్యవసాయ క్షేత్రం యజమాని ప్రాంజీవన్ సదరియా తెలిపారు. ఈ నెల 2న మొదటి సారిగా బావి నీటిలో కదలికలను గుర్తించానన్నారు. బావిలో నీళ్లు ఎగసిపడుతుండటంతో.. ఇక్కడ భూకంపం వచ్చే అవకాశం ఉందని మొదట గ్రామస్థులు భయపడ్డారు. దీనిపై జిల్లా భూగర్భ శాస్త్రవేత్త జేఎస్ వధేర్ మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో భూకంపం వచ్చే సూచనలు ఏమీ లేవని గాంధీనగర్‌లోని భూకంప పరిశోధనా సంస్థ స్పష్టం చేసిందన్నారు. బావిలో ఉన్న రాళ్లలోని సందులో నుంచి గాలి బయటకు వస్తుండటంతో నీటిపై ఒత్తిడి పెరిగి ఈ అలలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఈ ఘటనకు గల కారణాలు తెలుసుకోవడానికి భూగర్భ నిపుణుల బృందం దర్యాప్తు చేస్తోందని మోర్బి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ పేర్కొన్నారు.

# దిల్లీని ఎందుకు బందీగా ఉంచాలి..?: జంతర్‌మంతర్‌పై దిల్లీ హైకోర్టు వ్యాఖ్య



దేశ రాజధాని దిల్లీలోని నిరసన వేదిక 'జంతర్‌మంతర్'ను ఇంకా ఎందుకు మూసివేయడం లేదని దిల్లీ హైకోర్టు శుక్రవారం కేంద్రాన్ని ప్రశ్నించింది. అక్కడ తరచూ జరిగే నిరసనలు ప్రజాజీవనానికి ఆటంకం కలిగిస్తే.. ఈ నిరసన వేదికను మూసివేయొచ్చని సూచించింది. ఆల్ ఇండియా దళిత్ క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ వేసిన పిటిషన్‌పై కోర్టులో విచారణ జరిగింది. ఆగస్టు 10న జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టడానికి తమకు అనుమతి ఇవ్వాలని ఏఐడీసీఆర్‌పీ కోర్టును కోరింది. 75 మందితో శాంతియుతంగా చేపడతామని పేర్కొంది. ''నగరం లోపల నిరసనలు జరగడం సరైంది కాదనేది నా భావన. ఎందుకంటే ప్రజల జీవనానికి ఆటంకం ఏర్పడుతుంది. నగరాన్ని ఎందుకు అనవసరంగా బందీగా ఉంచాలి'' అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమిత్ మహాజన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. దిల్లీ పోలీసుల తరఫున ఏఎస్‌జీ చేతన్ శర్మ వాదనలు వినిపించారు. ''పిటిషనర్లు స్థానిక అధికారుల నుంచి ఎన్‌ఓసీ తీసుకోలేదు. ఈ జంతర్‌మంతర్ అంశం సుప్రీంకోర్టులో విచారణ దశలో ఉంది. ఈ 75.. ఎప్పుడు 75 వేలు అవుతుందో తెలియదు. పిటిషనర్ అభ్యర్థనపై నిర్ణయాన్ని దిల్లీ పోలీసులు రేపటిలోగా తెలియజేస్తారు'' అని శర్మ కోర్టుకు చెప్పారు. కాగా.. జంతర్‌మంతర్ ఇకపై నిరసనలకు అనువైన వేదిక కాదని, అక్కడ చేపట్టే ఆందోళనలతో స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారంటూ సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైన సంగతి తెలిసిందే. దానిని విచారించేందుకు సుప్రీం అంగీకరించింది.



# వెనుకున్నది అధికార దాహమే!

వర్షా కాల పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్నాయని ప్రభుత్వం నుంచి ప్రకటన రాగానే నిద్రాణమై ఉన్న భారత వ్యతిరేక అదృశ్య శక్తులు ఒక్కసారిగా మేల్కొన్నాయి. ఇప్పుడు ఢిల్లీలో నెలకొన్న పరిస్థితులు, వాటి వెనకున్న కారణాలను అన్వేషిస్తే విస్తుపోయే వాస్తవాలు బయటపడుతున్నాయి. ప్రభుత్వం పట్ల వ్యతిరేకతలు, భిన్నాభిప్రాయాలు కలిగి ఉండటం సహజం. భారతదేశం వంటి ఆదర్శ ప్రజాస్వామ్య రాజ్యంలో గతంలో ఎన్నో ఆందోళనలు జరిగాయి కానీ, ఇంత విద్వేషపూరితమైన, అసాధారణమైన పరిస్థితులు చూడటం బహుశా ఇదే మొదటిసారికావచ్చు. ఇవన్నీ చూస్తుంటే దేశంలో జరుగుతున్న అసహన రాజకీయాలు రూపుమార్చుకొని, అంతమొందించే రాజకీయాలుగా రూపాంతరం చెందాయన్న విషయం తెలుస్తోంది.

పక్కా ప్రణాళిక ప్రకారం విచ్ఛిన్నకర శక్తులు దేశంలో అలజడి సృష్టించడానికి ఎదురుచూస్తుండగా వచ్చిన ఈ అవకాశాన్ని దృష్టిలో పెట్టుకొని, అవి తమ దుశ్చర్యలకు రూపం కల్పించినట్టుగా ఈ ఆందోళన కనిపిస్తోంది. ఎన్నో ఏళ్లుగా అధికారం కోసం అర్రులు చాస్తూ వస్తున్న అవకాశవాద రాజకీయ నాయకులు తమ నిజస్వరూపాన్ని, ఈ దేశం పట్ల వారికున్న దురుద్దేశాన్ని, దేశ ప్రజల సంక్షేమం పట్ల వారికున్న నిర్లక్ష్య భావాన్ని నేడు బట్టబయలు చేస్తున్నారు.

ఇరవై ఆరు రోజులుగా నిరాహార దీక్ష చేసిన వాంగ్‌చుక్ గత చరిత్ర కూడా దేశ వ్యతిరేక కార్యకలాపాలతోనే ముడిపడి ఉంది. చైనాకు మద్దతుగా, పీఓకేను ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా పాకిస్థాన్‌లో కలపాలని వాదించిన వ్యక్తి. పర్యావరణ కార్యకర్తగా, విద్యావేత్తగా గుర్తింపు పొందిన వాంగ్‌చుక్ చేసినవన్నీ దేశ వ్యతిరేక కార్యకలాపాలే.

నిజంగా ఇది నీట్ కోసం జరిగిన ఉద్యమమే అయితే, అక్కడ నీట్ విద్యార్థులు కానీ, కనీసం వారి తల్లిదండ్రులు కానీ కనిపించలేదు. ఇప్పటివరకూ దేశంలో వందల పేపర్ లీకేజీలు జరిగాయి. అది వ్యవస్థలోని లోపాలను ప్రతిసారీ ఎత్తిచూపుతూనే ఉంది. అదీగాక, రీ–ఎగ్జామ్ జరిగి ఫలితాలు వచ్చిన తర్వాత, నిందితులను గుర్తించి అరెస్టు చేసిన తర్వాత కూడా ఆందోళనలు కొనసాగడం వెనుక వారి ఉద్దేశం ఏమిటి? అధికార దాహంతో వ్యవహరిస్తున్న శక్తులు తమ దుష్ట ఉద్దేశాలను అమలు చేయడానికి యువత బలహీనతలను అవకాశంగా మార్చుకుంటున్నాయి. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లో వలే ఇక్కడ కూడా అశాంతి సృష్టించేలా దేశద్రోహ కార్యక్రమాలు చేపట్టి, ప్రభుత్వంపై తిరుగుబాటు జరుగుతున్నట్లు చిత్రీకరించాలనే వారి కుట్ర బయటపడుతోంది. కాక్రోచ్ పార్టీ నాయకులు కొంతకాలం క్రితం జంతర్ మంతర్ వద్ద చేసిన వ్యాఖ్యలు కూడా ఇదే విషయాన్ని బహిర్గతం చేశాయి.

అంతేకాకుండా, ఆందోళనల సమయంలో మహిళల పట్ల అనుచిత ప్రవర్తన, అసభ్య వ్యాఖ్యలు చేయడం, మహిళా జర్నలిస్టులను దుర్భాషలాడడం వంటి ఘటనలు ఏ ఉద్యమానికీ సమర్థనీయమైనవి కావు. ఇంటర్నెట్‌ను నిలిపివేసిన పరిస్థితుల్లో కూడా మెసేజింగ్ యాప్‌ల ద్వారా ఆందోళనలకు రూపకల్పన చేయడం, నిఘా వర్గాలకు చిక్కకుండా హింసాత్మక చర్యలను నిర్వహించడం వంటి అంశాలను కూడా గమనించాల్సిన అవసరం ఉంది. ఇది ప్రేరేపిత ఉద్యమం కాకపోతే కేవలం జంతర్ మంతర్ వద్ద ఆందోళనలకు వచ్చినవారు.. భద్రతా దళాల కన్నుగప్పి ప్రధాని నివాసంపై దాడికి యత్నించడం, ఒక్కసారిగా ప్రతిపక్ష నాయకులు ప్రధాని నివాసానికి చేరుకుని ఆందోళన చేయటం రాజకీయ కుట్ర కాక మరేమిటి? అంతకు మూడు రోజుల ముందు అమెరికా వంటి దేశం తన పౌరులకు అడ్వైజరీ జారీ చేయడం గమనించాల్సిన విషయం. ఆందోళనకారులకు అవసరమైన నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? అనే విషయాన్ని కూడా కేంద్ర నిఘా సంస్థలు పరిశీలిస్తున్నాయి.

ప్రపంచంలోని కొన్ని దేశాలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించడానికి భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. భారతదేశాన్ని అంతర్జాతీయంగా అస్థిరంగా చూపించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అలాగే, దేశంలో రాజకీయంగా బలపడలేని, ప్రజా మద్దతు లేని నాయకులు, 'అసహనం' పేరుతో గతంలో ఉద్యమాలు చేసినవారు, ఆపరేషన్ కగార్ ఆపి నక్సల్స్‌ను కాపాడాలని చర్చలు జరపాలన్నవారు, అవార్డులు వాపస్ ఇచ్చిన ప్రముఖులను ఇప్పుడు తమ డిమాండ్లకు మద్దతుగా నిలబెట్టే ప్రయత్నం చేయడం రాజకీయ అసహనం కాక మరేమిటి? అలాంటి రాజకీయ పార్టీలు నేటి ఆందోళనకారులకు తోడవడం వారి ఉద్దేశాలను బట్టబయలు చేసింది. అక్కడకు వచ్చిన యువత సహజంగా వచ్చినవారు కాదు; వివిధ రాజకీయ పార్టీలు పంపిన పెయిడ్ బ్యాచ్‌లుగా కనిపించారు. అక్కడ ఉన్న మీడియా ప్రతినిధులపై కూడా దాడులు చేశారు. పోలీసులపై, సాయుధ బలగాలపై చెలరేగి, వారిని రెచ్చగొట్టి లాఠీచార్జికి ప్రేరేపించే ప్రయత్నం జరిగింది. గతంలో హైదరాబాద్‌లో జరిగిన రోహిత్ వేముల ఆత్మహత్య ఘటనను జాతీయ సమస్యగా చిత్రీకరించినట్లుగానే, ఇక్కడ కూడా ప్రతిపక్ష పార్టీలు అన్నీ ఒక్కటై ఆ మంటల్లో చలి కాచుకునే ప్రయత్నం చేశాయి. ఇప్పటికీ తెలంగాణలో నక్సల్ సానుభూతిపరులకు, అర్బన్ నక్సల్స్‌కు ప్రభుత్వం ప్రత్యక్షంగా ఆశ్రయం ఇస్తూ, సమయం వచ్చినప్పుడు వారిని రాజకీయ దాడులకు వాడుకుంటోంది.

విదేశాల్లో పుట్టిన కాక్రోచ్ పార్టీ… ప్రతిపక్షాలతో చేరి, తమకున్న అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుంటూ, మోదీ ప్రభుత్వాన్ని కూల్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. కేంద్ర మంత్రులు పార్లమెంట్ వేదికగా చర్చకు అంగీకరించారు. కానీ, చర్చలో పాల్గొనకుండా తమ విధ్వంసక చర్యలను కొనసాగించడానికి మొగ్గు చూపిన కాక్రోచ్ పార్టీ అంతరంగం అర్థమవుతోంది. ప్రధాని మోదీ ఈ పేపర్ లీకేజీ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని, ఇప్పటికే సంబంధిత మంత్రులతో చర్చించారు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు. పేపర్ లీకేజీల విషయంలో ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ జరిపించి, వేగంగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని కూడా ప్రకటించారు.

బలహీనమైన దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్లో జరిగిన హింసాత్మక పరిణామాలను భారతదేశంలో కూడా పునరావృతం చేయాలనే కుట్రలు ఎప్పటికీ విజయవంతం కావు. చైతన్యవంతమైన భారత యువత ఇవన్నీ గమనిస్తూనే ఉంది. గోరంతను కొండంతగా చూపిస్తూ యువతను, విద్యార్థులను రెచ్చగొట్టే రాజకీయాలను దేశం సహించదు. సమయం వచ్చినప్పుడు ఈ దేశ యువత ప్రతిపక్షాలకు తప్పక సమాధానం ఇస్తుంది.



# పాలస్తీనాకు భారత ఆపన్నహస్తం

భారతదేశం తాజాగా పాలస్తీనా శరణార్థుల ఐక్యరాజ్య సమితి సహాయ, ప్రజాపనుల సంస్థ (యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ) ద్వారా పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రకటించింది. గాజా తీవ్ర మానవతా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ చర్య పశ్చిమాసియాలో పరస్పర విరుద్ధ శిబిరాల మధ్య సమతుల్యతను పాటించాలనే ఇండియా విస్తృత వ్యూహాన్ని ప్రతిబింబిస్తోంది. దీనికి మానవ సహజ కారుణ్యానికి మించిన ప్రాధాన్యం ఉంది. ఇజ్రాయెల్‌తో వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేసుకుంటూనే అరబ్ దేశాలతో బలమైన భాగస్వామ్యాన్ని కొనసాగించడం, ఐరాస వంటి బహుళపక్ష సంస్థల ద్వారా పాలస్తీనాకు మద్దతును పునరుద్ఘాటించడం భారత వ్యూహంలో భాగం. ఇటీవల బ్రసెల్స్‌లో జరిగిన పాలస్తీనా దాతల బృందం రెండో సమావేశంలో భారత ప్రతినిధిగా పాల్గొన్న శ్రీప్రియ రంగనాథన్ పాలస్తీనా ప్రజలకు ఇండియా చిరకాల భాగస్వామి అని స్పష్టం చేశారు. అలాగే, ఇజ్రాయెల్, పాలస్తీనాలు రెండు స్వతంత్ర దేశాలుగా మనుగడ సాగించాలన్న ఐరాస తీర్మానాన్ని భారత్ సమర్థిస్తోందనీ, ఐరాసలో పాలస్తీనా సభ్యత్వానికి మద్దతు ఇస్తుందని ఆమె ఉద్ఘాటించారు. పాలస్తీనాలో భారత ప్రాజెక్టులు ఆరోగ్యం, విద్య, పునరావాసం, మహిళా సాధికారత, వృత్తి విద్యా శిక్షణపై దృష్టి పెడతాయని వివరించారు. యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ సలహా కమిషన్‌కు బెల్జియం త్వరలో కొత్త నేతగా బాధ్యతలు స్వీకరించనుంది. ఈ



**సందర్భంగా బ్రసెల్స్‌లో జరిగిన సమావేశంలో శ్రీప్రియ రంగనాథన్ పాల్గొని యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏకి, పాలస్తీనాలో అభివృద్ధి కార్యక్రమాలకు భారత్ తరపున మద్దతు తెలియజేశారు.**

మూడు మూల స్తంభాలు

భద్రతా మండలిలో 202829 కాలానికి భారత్ తాత్కాలిక సభ్యత్వం కోసం న్యూయార్క్‌లో ప్రచారం ప్రారంభించిన విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ కూడా, పాలస్తీనా కోసం ఒక ప్రత్యేక ఆసుపత్రి, కృత్రిమ అవయవాలు అమర్చే కేంద్రం, వృత్తి విద్యా శిక్షణ సంస్థను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. 'ఇది రెండు దేశాల సిద్ధాంతానికి మేము ఇస్తున్న మద్దతుకు అనుగుణమైనది' అని జైశంకర్ అన్నారు. పాలస్తీనాకు తోడ్పడటమంటే ఇజ్రాయెల్‌కు దూరం జరిగినట్లు కాదు. ఇజ్రాయెల్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగిస్తూనే పాలస్తీనా అభివృద్ధికి సహాయం అందించడం, రెండు దేశాల సమస్య పరిష్కారానికి సాయపడటం భారతదేశ ఉద్దేశం. ఇజ్రాయెల్ స్థాపనకు ముందు నుంచే పాలస్తీనా స్వయం నిర్ణయాధికారానికి భారత్ మద్దతు ఇస్తూ వస్తోంది. 1990ల నుంచి ఇజ్రాయెల్‌తో రక్షణ, వ్యవసాయం, సైబర్ భద్రత, సాంకేతిక రంగాలలో సహకారం గణనీయంగా వృద్ధి చెందినా, పాలస్తీనా పట్ల తన నిబద్ధతను భారత్ ఎప్పుడూ వీడలేదు. బ్రసెల్స్‌లో శ్రీప్రియ చేసిన ప్రకటన చర్చల ద్వారా రెండు దేశాల సిద్ధాంతాన్ని ఆచరణలోకి తీసుకురావడం, ఐరాసలో పాలస్తీనా సభ్యత్వానికి మద్దతు పలకడం, నిరంతర అభివృద్ధిమానవతా సాయం అనే మూడు మూలస్తంభాలతో కూడిన భారత్ విధానాన్ని పునరుద్ఘాటించింది.

ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ దాడులు పశ్చిమాసియా వాతావరణాన్ని మార్చివేశాయి. దీని రాజకీయ పరిణామాలు ఇజ్రాయెల్‌ను బలోపేతం చేశాయి. అదే సమయంలో సుదీర్ఘ ప్రాంతీయ సంఘర్షణల వల్ల కలిగే తీవ్ర కష్టనష్టాల గురించి వర్ధమాన దేశాల్లో ఆందోళనలు తీవ్రమయ్యాయి. ఈ నేపథ్యంలో యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ ద్వారా పాలస్తీనాకు భారత్ సహాయం అందించడం ముఖ్యమైన దౌత్య సందేశాలను పంపుతోంది. గత దశాబ్ద కాలంలో ఇజ్రాయెల్‌తో ఇండియా రక్షణ, వ్యూహాత్మక సహకారం విస్తరించింది. అయినప్పటికీ పశ్చిమాసియా సంఘర్షణల సమయంలో పాలస్తీనియన్లకు అదనపు సహాయాన్ని ప్రకటించడం ద్వారా… ఇజ్రాయెల్‌తో స్నేహ సంబంధాలు ఉన్నంత మాత్రాన పాలస్తీనా ప్రజల సమస్యలను, ఆందోళనలను తాను విస్మరించడం లేదని ఇండియా చాటుకుంది. నిజానికి యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ రాజకీయంగా అత్యంత వివాదాస్పదమైన ఐరాస సంస్థల్లో ఒకటిగా పేరొందింది. ఈ సంస్థ సిబ్బందిలో కొందరికి హమాస్‌తో సంబంధాలు ఉన్నాయని ఆరోపించిన ఇజ్రాయెల్, దీని కార్యకలాపాలను అడ్డుకోవాలనీ ప్రయత్నించింది. ఇజ్రాయెల్ ఆరోపణలపై విచారణలు జరిపిన సమయంలో అనేక పాశ్చాత్య దేశాలు పాలస్తీనా అభివృద్ధి నిధులను తాత్కాలికంగా నిలిపివేశాయి, ఆపై సమీక్షలు, అదనపు పర్యవేక్షణ చర్యల అనంతరం చాలా దేశాలు సహకారాన్ని పునరుద్ధరించాయి. 2023లో జీ20 అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి, భారత్ క్రమంగా వర్ధమాన దేశాల వాణిగా నిలవాలని దీక్షబూనింది. తరచూ చుట్టుముట్టే మానవతా సంక్షోభాల నుంచి వర్ధమాన దేశాలను ఆదుకోవడానికి భారత్ సన్నద్ధంగా ఉంటోంది. అరబ్ ప్రపంచం, ఆఫ్రికా, ఆసియాలలో అత్యధిక దేశాలు, ఇస్లామిక్ సహకార సంస్థ, అలీనోద్యమం పాలస్తీనా సమస్యకు మొదటి నుంచీ అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయి. భౌగోళిక రాజకీయ విభేదాలతో నిమిత్తం లేకుండా వర్ధమాన దేశాలు మానవతా సహాయాన్ని ఆశిస్తాయి. యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ ద్వారా పాలస్తీనాకు సహాయం అందించడం ఆ దేశాలలో భారత్ విశ్వసనీయతను పెంపొందిస్తుంది.

బాధ్యతాయుత భాగస్వామిగా…

యూఏఈ, ఒమన్, సౌదీ అరేబియాలలో భారత రాయబారిగా పనిచేసిన తల్మీజ్ అహ్మద్ అభిప్రాయం ప్రకారం పాలస్తీనాకు నిరంతరం సహాయం అందించాలనే భారత్ నిర్ణయం, ఇజ్రాయెల్ పట్ల ఢిల్లీ పక్షపాతం ప్రదర్శిస్తోందనే విమర్శలకు సమాధానం. యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ అంటే ఒక్క ఇజ్రాయెల్‌కు మాత్రమే గిట్టదని అహ్మద్ అన్నారు. 'కానీ, ఇది ఐరాస సంస్థ, మానవతా సహాయం విషయంలో అద్భుతమైన రికార్డు కలిగిన అత్యంత గౌరవనీయమైన సంస్థ. దీనిద్వారా సహాయం అందించడం ద్వారా పాలస్తీనా సమస్య పరిష్కారానికి భారత్ కట్టుబడి ఉందనే నమ్మకాన్ని పునరుద్ధరించగలుగుతాం' అని అహ్మద్ అభిప్రాయపడ్డారు. అయితే సహాయమనేది ఏదో ఒకే ఒక్కసారి చేసే చర్యగా ఉండకూడదనీ, దీర్ఘకాలిక దృష్టితో ఉండాలన్నారు. మొత్తంమీద, పాలస్తీనా ప్రజలకు, అంతర్జాతీయ మానవతా సంస్థలకు ఇండియా తన చారిత్రక నిబద్ధతను పునరుద్ఘాటిస్తూనే ఇజ్రాయెల్, అమెరికాలతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగించదలచింది. భిన్న ధ్రువాలుగా చీలిపోయిన పశ్చిమాసియాలో ఎవరో ఒకరి పక్షాన నిలవడం కంటే, శాంతి సుస్థిరతలను కోరుకునే బాధ్యతాయుతమైన భాగస్వామిగానే భారత్ ముందుకెళ్లనుంది.

# ఒక్క నైపుణ్యం సరిపోదు!

'ఇంజినీరింగ్‌లో ఏ బ్రాంచిలో చేరితే మంచి ఉద్యోగం వస్తుంది?' అనేది ఒకప్పుడు ఎక్కువగా వినిపించిన ప్రశ్న. డిమాండ్ ఉన్న బ్రాంచిలో చేరితే చాలు ఉద్యోగం ఖాయమనే నమ్మకం ఉండేది. కానీ ఏఐతో పరిస్థితి మారుతోంది. ఇప్పుడు బ్రాంచి గురించి అడగట్లేదు. మీకు ఏ సమస్యను పరిష్కరించే సామర్థ్యం ఉంది? కొత్త సాంకేతికతలను ఎంత వేగంగా నేర్చుకోగలరు? ఏఐతో కలిసి పని చేయగలరా?- కంపెనీలు ఇవే ప్రశ్నలను అడుగుతున్నాయి. ఇంజినీరింగ్ విద్యను, ప్లేస్‌మెంట్ వ్యవస్థను, కెరీర్ నిర్మాణాన్ని పూర్తిగా మార్చేస్తున్న పరిణామమిది. పరిశ్రమల్లో సమస్యలు ఒక్క విభాగానికే పరిమితం కావడం లేదు. ఆధునిక ఎలక్ట్రిక్ కారు తయారీలో మెకానికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ వంటివన్నీ కలిసి పనిచేస్తాయి. ఒక రోబోను తయారు చేయాలంటే మెకానికల్ డిజైన్ మాత్రమే సరిపోదు. సెన్సర్లు, ఎంబెడెడ్ సిస్టమ్స్, మెషీన్ లెర్నింగ్, కంప్యూటర్ విజన్, క్లౌడ్ కనెక్టివిటీ వంటివన్నీ అవసరమే. ఆధునిక ఆసుపత్రుల్లో ఉపయోగించే వైద్య పరికరాల అభివృద్ధికి బయోమెడికల్, ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్, డేటా అనలిటిక్స్ పరిజ్ఞానం కావాల్సిందే. అందుకనే పరిశ్రమలు ఇప్పుడు ఒక



**బ్రాంచి ఇంజినీర్ కోసం కాకుండా, బహుళ నైపుణ్యాలు కలిగినవారి కోసం చూస్తున్నాయి. మరోవైపు, ఏఐ ఉద్యోగాలను తీసుకుపోతుందా? అన్న ప్రశ్న వినిపిస్తోంది. వాస్తవానికి ఏఐ ఉద్యోగాలన్నింటినీ మాయం చేయట్లేదు. ఒకే తరహాలో చేయాల్సిన పనులను వేగంగా ఆటోమేట్ చేస్తోంది. కోడ్ రాయడం, డిజైన్ రూపొందించడం, డేటా విశ్లేషణ, డాక్యుమెంటేషన్‌లో ఏఐ సాధనాలు ఇప్పటికే ఇంజినీర్లకు సహాయం చేస్తున్నాయి. దీనర్థం ఉద్యోగాలు పోతాయని కాదు. కానీ కేవలం సిలబస్‌లో ఉన్న విషయాలు మాత్రమే తెలిసిన అభ్యర్థులకు అవకాశాలు తగ్గే పరిస్థితి ఉంది. ఏఐని సమర్థంగా వాడగలిగే వారికి కొత్త అవకాశాలు పెరుగుతున్నాయి.**

మారుతున్న ప్రమాణాలు

గతంలో చాలా కంపెనీలు మార్కులు, బ్రాంచి, కమ్యూనికేషన్ నైపుణ్యాల ఆధారంగా నియామకాలు చేసేవి. ఇప్పుడు పరిస్థితి మారుతోంది. రిక్రూటర్లు అభ్యర్థి గిట్‌హబ్ ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, హ్యాకథాన్‌లలో పాల్గొనడం, ఓపెన్ సోర్స్ కాంట్రిబ్యూషన్లు, సమస్య పరిష్కార నైపుణ్యం, ఏఐ సాధనాలను ఉపయోగించి నిర్మించిన ప్రాజెక్టులను కూడా పరిశీలిస్తున్నారు. 'నేను కంప్యూటర్ సైన్స్ చదివాను' అనడం కంటే 'నేను వ్యవసాయంలో నీటి వినియోగాన్ని తగ్గించే ఏఐ ఆధారిత పరిష్కారాన్ని రూపొందించాను' అని చెప్పగలిగే అభ్యర్థి ఎక్కువ ప్రభావం చూపే పరిస్థితి ఏర్పడుతోంది. ప్రోగ్రామింగ్ భాషలు, డిజైన్ టూల్స్, తయారీ విధానాలు, ఏఐ మోడళ్లు నిరంతరం సరికొత్తగా వస్తూనే ఉన్నాయి. అందుకని ఒకే బ్రాంచికి పరిమితమైతే కెరీర్ కూడా అక్కడితో ఆగిపోయే ప్రమాదం ఉంది. మెకానికల్ విద్యార్థి డేటా అనలిటిక్స్ నేర్చుకుంటే, ఎలక్ట్రికల్ విద్యార్థి పైథాన్‌లో నైపుణ్యం సంపాదిస్తే, సివిల్ విద్యార్థి డ్రోన్లు, జీఐఎస్, డిజిటల్ ట్విన్ సాంకేతికతలను నేర్చుకుంటే ఉద్యోగ అవకాశాల పరిధి విస్తరిస్తుంది. ఈ క్రమంలో కళాశాలలు కూడా మారక తప్పదు. ఇప్పటికీ అనేక కళాశాలలు పాత సిలబస్, పాత ల్యాబ్‌లు, పాత బోధనా విధానాలతోనే కొనసాగుతున్నాయి. మరోవైపు, పరిశ్రమల అవసరాలు మాత్రం వేగంగా మారిపోతున్నాయి. కాబట్టి ఇంజినీరింగ్ విద్యలో ఇంటర్ డిసిప్లినరీ కోర్సులు, ఏఐ ప్రాథమికాలు అవసరం. డేటా విశ్లేషణ, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ తయారీ, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, పారిశ్రామిక భాగస్వామ్యాలు, దీర్ఘకాలిక ఇంటర్న్‌షిప్‌లు కూడా తప్పనిసరి కావాలి.

నిరంతర అభ్యాసంతోనే…

పరీక్షల్లో మార్కులు మాత్రమే కాదు, వాస్తవ సమస్యలకు పరిష్కారాలను రూపొందించే సామర్థ్యాన్ని కూడా అంచనా వేస్తున్న సమయమిది. అందువల్ల ప్రతి విద్యార్థి తన ప్రధాన విభాగంతోపాటు కనీసం ఒక ప్రోగ్రామింగ్ భాష, డేటా విశ్లేషణ, ఏఐ సాధనాల వినియోగం, ప్రాజెక్టు నిర్వహణ, కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి. పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను చూపించే నైపుణ్యాలను పెంచుకోవాలి. భవిష్యత్తు ఒక్క కంప్యూటర్ సైన్స్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్ విద్యార్థిదో కాదు. నిరంతరం నేర్చుకునే ఇంజినీర్‌దే భవిత. విభిన్న రంగాల పరిజ్ఞానాన్ని కలిపి కొత్త పరిష్కారాలు సృష్టించగలవారికే అవకాశాలుంటాయి. ఏఐని పోటీదారుగా కాకుండా సహాయకుడిగా ఉపయోగించగలవారే ఇప్పుడు నెగ్గుకురాగలరు. 'ఒక బ్రాంచి ఒక ఉద్యోగం' అనే పాత సూత్రం క్రమంగా చరిత్రగా మారుతోంది. 'ఒక పునాది బహుళ నైపుణ్యాలు నిరంతర అభ్యాసం' అనే కొత్త సూత్రమే ఉద్యోగ ప్రపంచాన్ని నిర్వచిస్తోంది. ఇంజినీరింగ్‌లో బ్రాంచి అనేది ప్రయాణానికి ప్రారంభ స్థానం మాత్రమే. ప్లేస్‌మెంట్లలో విజయం సాధించేది కేవలం ఒక శాఖలో నిపుణుడైన విద్యార్థి కాదు. తన శాఖను దాటి కొత్త నైపుణ్యాలను అలవర్చుకుని, మారుతున్న సాంకేతిక ప్రపంచానికి అనుగుణంగా తనను తాను నిరంతరం మార్చుకునే ఇంజినీర్‌నే రేపటి పరిశ్రమలు కోరుకుంటాయి.

# వాఘా.. గుండెలు ఉప్పొంగలేదు!

చిన్నప్పటి నుంచి మన దేశ సరిహద్దుల గురించి వినీ చదివీ ఒక చరిత్ర విద్యార్థిగా ఉప్పొంగిపోయాను. ఉత్తరాన హిమాలయాలు మంచుతో నిండివుంటాయనీ– ౖకెబర్, బోలాన్ కనుమల గుండా ఇతర ప్రాంతాల నుంచి మన దేశంలోకి శతాబ్దాలుగా మానవ సంచారం జరిగిందని చదువుకుని, మాకు మేమే ఉత్తేజితులమయ్యాం. బౌద్ధ భిక్షువులే కాక హర్షుడి కాలం నుంచి హుయన్‌త్సాంగ్, అలెగ్జాండర్, రాహుల్ సాంకృత్యాయన్ వంటి ఎందరో మహనీయులు మానవ నాగరికతకు, సంస్కృతికి, చరిత్రకు వారధి కట్టారు. అదంతా మనసులో నిండివుండడంతో డెబ్బై మూడేళ్ల వయసులో పదిమందితో కలిసి హిమాలయాల సందర్శనానికి సాహసంతోనే బయలుదేరాం. వారిలో సగంమంది అరవైలు దాటినవాళ్లు. మిగిలినవాళ్లు యాభైలలో ఉన్న యువకులు.ఇదంతా దేనికంటే– ఈ

**వయసులో శ్రీనగర్ నుంచి లేహ్ మీదుగా నుబ్రావాలి, కృతుంగాపాస్, పాన్‌గాంగ్ సరస్సుదాకా ఆక్సిజన్ లెవల్స్‌తో ఇబ్బంది పడతామని తెలిసి కూడా సాహసించాం. పాన్‌గాంగ్ (చైనా సరిహద్దు) నుంచి కార్గిల్ (పాకిస్థాన్ సరిహద్దు) దాకా ప్రయాణించి అద్భుతమైన పర్వతాలను, మరోవైపు దిగంతాలను తలపించే లోయలను చూస్తూ– ప్రమాదభరితమని తెలిసినా సంతోషంగా గడిపాం.**

ఇంత ఆనందంలో చివరి రోజు, చివరి ఘట్టం ఎంత దిగులుగా, నిరాశగా, నిస్పృహగా మిగిలిందంటే- మా పదిహేను రోజుల యాత్రను నీరసపరిచింది. భారతీయులుగా 'వాఘా' సరిహద్దు సైనిక కవాతు చూడడం నిజంగా గర్వకారణం. మేమంతా ఎప్పటి నుంచో ఆ బోర్డర్‌లో ప్రదర్శించే సైనిక కవాతు గురించి వినివున్నాం. నెట్‌లో చూసి కూడా ఎంతో ఉత్తేజితులం అయివున్నాం. అయితే మేము వెళ్లినరోజు అక్కడి ప్రదర్శన మాకు అత్యంత నిరాశను కలిగించింది. ఈ నెల తొమ్మిదో తేదీ అయిదు గంటలకల్లా ఆగమేఘాల మీద అక్కడికి చేరుకున్నాం. ఆ వేల మందిలో కూర్చునే చోటు దక్కించుకుని ప్రదర్శన కోసం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాం. అయిదున్నరకు ప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు, ఆరున్నరకు గానీ ప్రారంభం కాలేదు. అది కూడా ఎంత నిరాశ కలిగించిందో చెప్పలేం. అయిదున్నరకు సందర్శకుల నుంచి- మహిళలను ప్రదర్శన జరిగే చోటుకు పిలిచారు. వారితో జాతీయ జెండా ప్రదర్శింపజేశారు. అంతవరకే అయితే ఫరవా లేదు. కానీ దేశభక్తితో కూడిన పాటలు పెట్టి మహిళలతో చేతులు ఊపుతూ ప్రదర్శన చేయించారు. అదీ పోనీ అనుకుంటే- ఈ చేరిన మహిళలు ఆ కవాతు జరిగే ప్రదేశంలో బతుకమ్మలాడారు. కొందరైతే చేతులు పట్టుకుని 'ఒప్పుల కుప్ప' ఆడారు. అది చూస్తూ మాకు ఎంత ఆవేదన కలిగిందో చెప్పలేం.

మహిళలను ప్రతి దానిలో భాగం చేయాలనే కాంక్ష కొద్దీ ఈ మధ్య రథయాత్రలు, దేవుడి ఊరేగింపుల ముందు, కోలాటాలూ వేయించడం- ఇది ఏ సంస్కృతో తెలియదుగానీ దిగువ మధ్యతరగతి స్త్రీలు ఈ ప్రదర్శనలకు ఆలంబన కావడం దురదృష్టం. గుడిలో పూజాకైంకర్యాలు చేసే దేవదాసీలను నిషేధించి- వీధి ఊరేగింపుల్లో భక్తి పేరుతో ఎందుకు వీరిని తెస్తున్నారో అర్థం కావడం లేదు. దానినే సహించలేని సమాజికులుగా 'వాఘా' బోర్డర్ సైనిక కవాతు సందర్భంగా కూడా మహిళలను ఆ ట్రాక్‌లోకి ఆహ్వానించి ప్రదర్శనను ఇంత పేలవంగా, అగౌరవంగా జరపడం శోచనీయంగా భావిస్తున్నాం. చివరికి నెట్‌లో చూసినపాటి ప్రదర్శన కూడా లేకుండా సైనిక



కవాతు ముగించారు. బోర్డర్ గేట్లు తీయడం లేదు. ఇరువైపుల సైనికుల కరచాలనం లేదు. ఇదంతా అనకూడదుగానీ ఏదో విన్యాసం కింద తయారయింది. భారతీయ పౌరులందరికీ దేశభక్తి ఎంతో మహోన్నతమైనది. ఆ మాట తలుచుకుంటే గుండెలు ఉప్పొంగుతాయి. దానికి ప్రతీక అయిన 'వాఘా బోర్డర్' కవాతును ఆ రోజు అలా చూడటం నాకు ఎంతో బాధాకరంగా అనిపించింది. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిని సరిదిద్దుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

# సుద్దముక్కపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి దుర్గేష్ పేర్లతో అద్భుత కళాఖండం

- ఆర్టిస్ట్ కోడూరి నాగ సూర్య రాఘవేంద్ర బాబు మైక్రో ఆర్ట్‌ను అభినందించిన మంత్రి కందుల దుర్గేష్
- చివటం గ్రామ మధ్యలో ఉన్న డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి మంత్రి దుర్గేష్ హామీ
- గ్రామ పరిపాలన, రైతు సేవలకు నిలయమైన సొసైటీ భవనం సందర్శన



**నిడదవోలు ఆగస్టు 07 అనంత జనశక్తి న్యూస్**

నిడదవోలు నియోజకవర్గం ఉండ్రాజవరం మండలం చివటం గ్రామంలో శుక్రవారం పర్యటించిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను ప్రముఖ మైక్రో ఆర్టిస్ట్ కోడూరి నాగ సూర్య రాఘవేంద్ర బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. జాతీయ చేనేత దినోత్సవం మరియు 'పల్లె పండుగ 2.0' కార్యక్రమాల సందర్భాన్ని పురస్కరించుకుని సుద్దముక్క పై "కందుల దుర్గేష్", "డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్", "రాష్ట్ర చేనేత దినోత్సవం", "పల్లె పండుగ" అనే నాలుగు పేర్లను సూక్ష్మ కళారీతిలో అత్యంత అద్భుతంగా చెక్కి మంత్రి దుర్గేష్‌కు బహుకరించారు. ఈ సందర్భంగా సభా వేదికపై నాగ సూర్య రాఘవేంద్ర బాబును ప్రత్యేకంగా ఆహ్వానించి ఆయనలోని అసాధారణ మైక్రో ఆర్ట్ నైపుణ్యాన్ని అభినందించి సత్కరించారు.

**సొసైటీ భవనం సందర్శన:**
అనంతరం గ్రామ పర్యటనలో భాగంగా చివటం గ్రామంలో జనాభా మరియు విస్తీర్ణం గణనీయంగా పెరగడం వల్ల గతంలో ఊరి బయట ఉన్న డంపింగ్ యార్డ్ ప్రస్తుతం గ్రామం మధ్యలోకి వచ్చేసిందని, దీనివల్ల దుర్గంధం, ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానిక ప్రజలు మంత్రి దుర్గేష్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల విజ్ఞప్తిపై తక్షణమే స్పందించిన మంత్రి కందుల దుర్గేష్, అధికారులతో కలిసి డంపింగ్ యార్డ్ వద్ద ఉన్న వాస్తవ పరిస్థితులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గ్రామస్థుల ఆరోగ్యం, పారిశుద్ధ్యం తమకు ముఖ్యమని, త్వరలోనే డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించడం పట్ల చివటం గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఆ తర్వాత గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) భవనాన్ని మంత్రి దుర్గేష్ సందర్శించారు. సొసైటీ ద్వారా రైతులకు అందుతున్న రుణాలు, ఎరువులు మరియు ఇతర సేవల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతాంగానికి నిరంతరం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.

# సాగునీటి రంగాన్ని... వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు.. కూటమి ప్రభుత్వం అభివృద్ధి బాట పట్టిస్తోంది
రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
వేల్పురాయిలో వైభవంగా 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమం ప్రారంభం
రణస్థలానికి తోటపల్లి నీటిని తీసుకువచ్చే బాధ్యత మాదే
ఏపీ ఏఐ ఐఎంఎస్' యాప్ ద్వారా సేవలు..

ఈ నెల 15లోగా పంటల బీమా నమోదు చేసుకోవాలి




రణస్థలం, ఆగస్టు 7 , అనంత జనశక్తి న్యూస్

రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులను అప్రమత్తం చేసి, పంట నష్టాన్ని నివారించడంతో పాటు ప్రత్యామ్నాయ సాగుపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'రైతన్నా.. మీ కోసం' కార్యక్రమాన్ని ప్రారంభించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రణస్థలం మండలం వేల్పురాయి గ్రామంలో నిర్వహించిన 'రైతన్నా.. మీకోసం' అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు.

**సాగునీటి రంగాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది**
గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో సాగునీటి ప్రాజెక్టులు, నీటిపారుదల రంగాన్ని పూర్తిగా విస్మరించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, ఆధునికీకరణ, పూర్తికి అవసరమైన చర్యలు చేపట్టకుండా రైతాంగ ప్రయోజనాలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రాష్ట్రానికి అవసరమైన మౌలిక వసతులు, సాగునీటి ప్రాజెక్టులను అభివృద్ధి చేయాల్సిన సమయంలో గత ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిందని ఆరోపించారు. అప్పులు చేసిన స్థాయిలో ప్రజలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తులను సృష్టించడంలో మాత్రం విఫలమైందని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడంతో పాటు అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల సమర్థవంతమైన నాయకత్వం, సమన్వయంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులను సమీకరించడం, పెండింగ్ పనులను వేగవంతం చేయడం, రైతులకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రాజెక్టులు పూర్తయితేనే రైతు పొలాలకు నీరు.. రైతు కుటుంబాలకు భరోసా.. రాష్ట్రానికి ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. గత పాలనలో నిర్లక్ష్యానికి గురైన సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి వెల్లడించారు. రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

**తోటపల్లి నీరు తెస్తాం.. సాగునీటి కష్టాలు తీరుస్తాం**
రాష్ట్రంలోనే అత్యల్పంగా భూగర్భ జలాలు ఉన్న మండలాల్లో రణస్థలం ఒకటని, వందల అడుగుల లోతుకు బోర్లు వేసినా నీరు పడని తీవ్ర పరిస్థితి ఇక్కడ నెలకొందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తోటపల్లి ప్రాజెక్టు నీటిని రణస్థలం మండలానికి తీసుకువచ్చే బాధ్యతను ప్రభుత్వం స్వీకరిస్తుందని హామీ ఇచ్చారు. అలాగే భూగర్భ జలాలు తక్కువగా ఉన్నందున ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖల సహకారంతో 9 రకాల విత్తనాలతో కూడిన ప్రత్యేక కిట్లను రైతులకు తక్కువ ధరకే పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలకు రక్షణ కల్పించేందుకు పంటల బీమా గడువును ఈ నెల 15వ తేదీ వరకు ఖరారు చేశామని మంత్రి తెలిపారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన రైతులకు ఆయా బ్యాంక్ మేనేజర్లే బీమా చెల్లిస్తారని, రుణాలు తీసుకోని రైతులు స్వయంగా ఇన్సూరెన్స్ నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఈ బీమా ప్రాముఖ్యతపై విస్తృత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు.

**ఏడు రోజుల పాటు క్షేత్రస్థాయి పరిశీలన**
వర్షాభావం తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్యశాఖల అధికారులు సమన్వయంతో ఏడు రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతి ఎకరా భూమిని పరిశీలిస్తారని మంత్రి తెలిపారు. ఉదాహరణకు రణస్థలం మండలంలో 49 శాతం లోటు వర్షపాతం నమోదైన నేపథ్యంలో అక్కడి పరిస్థితులను అధికారులు సమగ్రంగా పరిశీలించి, రైతులకు అనువైన ప్రత్యామ్నాయ పంటలు, సాగు విధానాలపై సూచనలు అందిస్తారని చెప్పారు. రైతుల సౌకర్యార్థం 'ఏపీ ఏఐఐఎంఎస్' రిజిస్ట్రేషన్ యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మంత్రి వెల్లడించారు. ఈ యాప్ ద్వారా భూమి వివరాలు, వేసే పంటలు, మార్కెట్ ధరలు, విక్రయించే ప్రాంతాల సమాచారంతో పాటు ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ యంత్ర పరికరాలను సులభంగా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ వారం రోజుల కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు ప్రతీ రైతుతో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. రణస్థలం, లావేరు, జి.సిగడాం మండలాల్లో మొక్కజొన్న సాగు చేసే రైతులు ఎదుర్కొంటున్న నీటి ఎద్దడి, మద్దతు ధరల సమస్యలపై ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదటి ఈశ్వరరావు మాట్లాడారు. మడ్డువలస కాలువ నీటిని బుడుమూరు చెరువుకు మళ్లించి పరిసర ప్రాంతాల రైతులకు సాగునీటి కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. 50 వేల ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉన్న తోటపల్లి ప్రధాన, పిల్ల కాలువలను బాగు చేసి టైల్ఎండ్ భూములకు నీరందిస్తామన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.20వేలు అన్నదాత సుఖీభవ సకాలంలోఖాతాల్లో జమ కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ, మొక్కజొన్న రైతులకు దళారుల దోపిడీ నుంచి విముక్తి కల్పించేలా ముందస్తు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

పప్పుధాన్యాలు ఎంత పండిస్తే అంత కొంటాం: కమిషనర్ మనజీర్ జిలానీ సమూన్

వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు వరి నుంచి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని వ్యవసాయ శాఖ కమిషనర్ మనజీర్ జిలానీ సమూన్ కోరారు. వరికి ప్రత్యామ్నాయంగా కందులు, మినుములు ఎంత మేర పండిస్తే అంత ఉత్పత్తిని కనీస మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. రాగులు వంటి చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని, రాష్ట్రంలో రైతులు పండించే రాగులను ప్రభుత్వమే సేకరించి పంపిణీ చేస్తుందన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రతి పొలానికి వెళ్లి రైతులకు ప్రత్యామ్నాయ సాగుపై చైతన్యం తీసుకురావాలని స్పష్టం చేశారు.

**నవధాన్యాల సాగుతో భూసారం పెంచుకుందాం: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

వాతావరణ మార్పులను తట్టుకుని రైతులకు నిలకడైన రాబడి అందించేందుకు నవధాన్యాల సాగు ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. హెక్టారుకు కేవలం రూ.600 విత్తన వ్యయంతో భూసారాన్ని పెంచుకోవచ్చని, సీఆర్పీల ద్వారా విత్తన పెల్లెటైజేషన్‌పై క్షేత్రస్థాయిలోనే శిక్షణ ఇప్పిస్తామన్నారు. నవధాన్యాల వల్ల యూరియా వాడకం తగ్గుతుందని, ప్రతికూల వాతావరణంలోనూ రైతులకు కనీస ఆదాయం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన' కింద పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అంతకుముందు మంత్రి అన్ని శాఖల అధికారులతో కలిసి గ్రామంలోని పంట పొలంలో నాట్లు వేసిన వరి పొలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, ఇతర అనుబంధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# నేతన్న సేవ పథకం కింద రూ.25వేలు జమ

**యాడికి, ఆగష్టు 7, అనంత జనశక్తి న్యూస్:**

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేసిన నేతన్న సేవ పథకం కింద యాడికి మండలంలో ఉన్న చేనేత కార్మికులకు శుక్రవారం రూ.25వేలు జమ అయ్యాయని పలువురు చేనేత కార్మికులు తెలిపారు. నేతన్న సేవ పథకం కింద మొదట ప్రకటించిన జాబితాలో తప్పులు ఉన్న, పేర్లు లేని చేనేత కార్మికులు మరళా దరఖాస్తు చేసుకోన్నారు. దీంతో రెండవ సారి దరఖాస్తులో సుమారు మండల వ్యాప్తంగా 1813 మంది దరఖాస్తు చేసుకోన్నారు. చేనేత కార్మికులకు రూ.25 వేలు జమ అయ్యాయి. దీంతో చేనేత కార్మికులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా చేనేత జౌళి శాఖ ఎడిఓ శ్రీనివాసులు మాట్లాడుతూ అనంతపురం జిల్లా వ్యాప్తంగా 8300 దరఖాస్తులు అందాయని, ఇందులో 7200 మంది చేనేత కార్మికులకు నేతన్న సేవ పథకం కింద రూ.25వేలు జమ అయ్యిందని తెలిపారు. యాడికి మండలంలో 2000 మంది చేనేత కార్మికులకు, పెద్దపప్పూరు మండలంలో 1000 చేనేత కార్మికులకు, పెద్దవడుగురు లో 500 చేనేత కార్మికులకు, తాడిపత్రి లో 900 మంది చేనేత కార్మికులకు, ఉరవకొండలో 700 చేనేత కార్మికులకు,గార్లదిన్నె మండలంలో 250 మంది చేనేత కార్మికులకు, బుక్కరాయసముద్రంలో 230 మందిచేనేత కార్మికులకు, రాయదుర్గం 230 మంది చేనేత కార్మికులకు, నార్పలలో 250 మంది చేనేత కార్మికులకు,సింగనమల మండలంలో 120 మంది చేనేత కార్మికులకు,గుత్తి మండలం లో 100 మంది చేనేత కార్మికులకు, గుంతకల్లు లో 100 మంది
చేనేత కార్మికులకు, పామిడిలో 150 మంది చేనేత కార్మికులకు జమ అయ్యాయని తెలిపారు.



# నేతన్నలకు అండగా నిలువాలి

(మొదటిపేజీ తరువాయి)



వెంటనే అన్ని పథకాలను పునరుద్ధరించి నేతన్నలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.
జాతీయ చేనేత దినోత్సవం కేవలం ఉత్సవాలు నిర్వహించుకునే రోజు కాదని, చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే విధానాలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ కలిసి చేనేత రంగాన్ని సంక్షోభం వైపు నెడు తున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ కార్యక్రమాలు
బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేశంలో ఎక్కడా లేని విధంగా చేనేత రంగానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 55,072 మంది చేనేత కార్మికులకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పిస్తూ 'నేతన్న బీమా' అమలు చేశామని తెలిపారు. ఒక్కో కార్మికుడికి ప్రీమియం ప్రభుత్వమే భరించిందని వివరించారు. 'నేతన్నకు చేయూత' పథకం ద్వారా కార్మికుల పొదుపును ప్రోత్సహిస్తూ, కార్మికుడు ప్రతి నెల రూ.1,200, అనుబంధ కార్మికుడు రూ.800 చెల్లిస్తే ప్రభుత్వం రూ.4,000 వరకు వాటా జమ చేసే వినూత్న విధానాన్ని అమలు చేశామని తెలిపారు. అదేవిధంగా చేనేత సహకార సంఘాలకు పావలా వడ్డీ రుణాలు, 20 శాతం మార్కెటింగ్ రిబేట్ అందించడంతో పాటు బతుకమ్మ చీరలు, ప్రభుత్వ పాఠశాల యూనిఫారాల తయారీ వంటి భారీ ప్రభుత్వ ఆర్డర్లను చేనేత రంగానికే అప్పగించి వేలాది కుటుంబాలకు నిరంతర ఉపాధి కల్పించామని పేర్కొన్నారు. చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన పావలా వడ్డీ రుణాలు, మార్కెటింగ్ రిబేట్లు నిలిచిపోయాయని, బతుకమ్మ చీరలు, ప్రభుత్వ యూనిఫారాల వంటి ప్రభుత్వ ఆర్డర్లలో నేతన్నలకు గతంలో ఇచ్చిన ప్రాధాన్యతను తగ్గించారని విమర్శించారు. ప్రభుత్వ ఆర్డర్లు అన్ని కమీషన్ల కోసం ప్రైవేట్ సంస్థలకు వ్యక్తులకు అప్పజెప్పున్నారని విమర్శించారు. చేనేత భరోసా కింద ప్రతి ఏడాది రూ.18 వేల ఆర్థిక సాయం, అనుబంధ కార్మికులకు రూ.6 వేల సహాయం, లక్ష రూపాయల వరకు వ్యక్తిగత రుణమాఫీ, చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాల మాఫీ, కేంద్రం విధిస్తున్న 5 శాతం జీఎస్టీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్న హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేనేత రంగానికి తీవ్ర అన్యాయం
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా చేనేత రంగానికి తీవ్ర అన్యాయం చేసిందని కేటీఆర్ విమర్శించారు. ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు, హ్యాండీక్రాఫ్ట్స్ బోర్డు, పవర్‌లూమ్ బోర్డులను రద్దు చేయడం, హౌస్ కమ్ వర్క్‌షెడ్ వంటి పథకాలను ఎత్తివేయడం, చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ విధించడం వంటి నిర్ణయాలు చేనేత రంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయని పేర్కొన్నారు. చేనేత కళాకారుల కోసం ప్రత్యేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని, గతంలో రద్దు చేసిన అన్ని పథకాలను పునరుద్ధరించాలని కోరారు. ఇప్పటికైనా మోసపూరిత వైఖరిని వీడి నేతన్నల కుటుంబాలకు అండగా నిలవాలని ముఖ్యమంత్రికి సూచించారు.

# పంట రక్షణ కరపత్రాలు రైతులకు పంపిణీ



- ఇంటింటి తెదేపా కార్యక్రమంలో ఎమ్మెల్యే అమిలినేని

**కళ్యాణదుర్గం ఆగస్టు 07 జనశక్తి న్యూస్**

ఎల్ నీనో పరిస్థితులలో రైతులు పంట కోతల సమయంలో ఏర్పడే సమస్యలు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అందుకోసం రాష్ట్ర వ్యవసాయ శాఖ కరపత్రాల రూపంలో అంతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసింది. వాటిని ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ముద్దినానిపల్లి కోడి పల్లి గ్రామాలలో అగ్రికల్చర్ ఏ.డి ఎల్లప్ప ఏ.ఈ శ్రావణ్ కుమార్ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చేతులతో రైతులకు పంపిణీ చేసి అగ్రికల్చర్ అధికారులు రైతులకు వాటి రక్షణ కొరకు జాగ్రత్తలు కార్యక్రమంలో తెలిపారు.

# అవాస్తవ సమాచారానికి అడ్డుకట్ట..




- ప్రభుత్వ సమాచార వ్యాప్తికి సమన్వయం
- పీఐబీ విజయవాడ ఆధ్వర్యంలో ఐఎంపిసిసి సమావేశం

**విజయవాడ ఆగస్టు 07, అనంత జనశక్తి న్యూస్**

ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల సమాచారాన్ని ప్రజలకు వేగంగా, సమర్థవంతంగా చేరవేయడంతో పాటు అవాస్తవ సమాచారాన్ని అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని పీఐబీ విజయవాడ డైరెక్టర్ జి. సురేష్ కుమార్ పిలుపునిచ్చారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) విజయవాడ ఆధ్వర్యంలో ఇంటర్ మీడియా పబ్లిసిటీ కోఆర్డినేషన్ కమిటీ (ఐఎంపిసిసి) సమావేశం శుక్రవారం నిర్వహించారు.సమావేశంలో జి. సురేష్‌కుమార్ మాట్లాడుతూ, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, దూరదర్శన్, ఆకాశవాణి సంస్థలు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల ప్రచారానికి అన్ని విభాగాలకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో తపాలా శాఖ, రైల్వే శాఖ, ఎయిమ్స్, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, భారత ఆహార సంస్థ, ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్, జాతీయ గణాంక కార్యాలయం, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, విమానాశ్రయాల ప్రాధికార సంస్థ, భారత ప్రమాణాల బ్యూరో, దూరదర్శన్, ఆకాశవాణి తదితర కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల నుంచి 15 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. తమ శాఖల ముఖ్య కార్యక్రమాలు, విజయాలు, ప్రచార కార్యక్రమాల వివరాలను పంచుకోవడంతో పాటు ప్రభుత్వ సమాచార వ్యాప్తిని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ప్రభుత్వ సమాచార ప్రసారాన్ని బలోపేతం చేయడానికి పరస్పర సమన్వయాన్ని మరింత పెంపొందించుకోవాలని నిర్ణయించారు.

# సోమందేపల్లి మండల కేంద్రంలో 12 వ జాతీయ చేనేత దినోత్సవం సంబరాలు.



- ఆంధ్రప్రదేశ్ చేనేసి కార్మిక సంఘం మండల సమితి.

**సోమందేపల్లి ఆగస్టు 07,అనంత జనశక్తి న్యూస్**

సోమందేపల్లి మండల కేంద్రంలో 12వ జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా చేనేత కార్మికులందరూ కలిసి చేనేత సర్కిల్ నుండి అంబేద్కర్ సర్కిల్ మరియు వాల్మీకి సర్కిల్ ప్రదర్శనగా వెళ్లి ""చేనేత కార్మికుల- ఐక్యత వర్ధిల్లాలి", "జై చేనేత జై జై చేనేత" అని నినాదాలు చేస్తూ చేనేత స్తంభం వద్దకు చేరుకొని 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి రాజగోపాల్ అధ్యక్షతన స్థానిక చేనేత కార్మికుడు సాయి నగర్ కాశీమ్ చేనేత జెండాను ఆవిష్కరించగా మరియు నల్లగుండ్ల శ్రీనివాసులు కేక్ కట్ చేసి 12వ జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమాలను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ కౌన్సిల్ సభ్యులు శీలా నారాయణస్వామి మాట్లాడుతూ ఈరోజు ఒక పండుగ వాతావరణం లో రాష్ట్రంలోని చేనేత కార్మికులందరూ ఎంతో సంతోషంతో ఈ 12వ జాతీయ చేనేత దినోత్సవం జరుపుకుంటున్నాము చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ మంగళగిరిలోనే చేనేత గర్జన, 48 గంటల చేనేత దీక్ష, మరియు రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల వద్ద ధర్నాలు ఈ పోరాటాల ఫలితమే 200 ల యూనిట్ల ఉచిత విద్యుత్తు,నేడు నేతన్న సేవ పేరుతో చేనేత కార్మికుల ఖాతాలోకి 25000/-రూ జమ, అంతేకాకుండా "నేతన్న సేవ" లో ఎలాంటి అవకతవకలు జరగకుండా అధికారులు గమనించి మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికునికి న్యాయం జరిగేలా చూడాలని, అలా లేని పక్షంలో నిజమైన ఒక్క చేనేత కార్మికుని అన్యాయం జరిగితే ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం సోమందేపల్లి మండల సమితి మండలంలోని చేనేత కార్మికులందరిని కలుపుకొని వారికి న్యాయం జరిగేంత వరకు ఎలాంటి పోరాటాల కైనా సిద్ధంగా ఉండాలనిచెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో CPI మండల సహాయ కార్యదర్శి చాంద్ భాషా, సిపిఎం మండల కార్యదర్శి జింకా నాగరాజు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం సోమందేపల్లి మండల సమితి సభ్యులుదాసరి సుధాకర్, బాలం కృష్ణయ్య, కురబ శ్రీనివాసులు, బెస్ట్ కిష్టప్ప, బెత్త వెంకటేశులు,మంచాల హరి, పోతలయ్య, రామాంజనేయులు మరియు చేనేతకార్మికులు పాల్గొనడం జరిగింది.

# పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



**మణుగూరు, ఆగస్టు 7, (అనంత జనశక్తి ) :**
మణుగూరు మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం కార్యదర్శి మరియు మణుగూరు మండల అధ్యక్షులు డాక్టర్ దుస్సా సమ్మయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు, శుక్రవారం మణుగూరు పట్టణంలోని పద్మశాలి సంఘం భవనంలో 11వ జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దుస్సా సమ్మయ్య మాట్లాడుతూ, 1905 ఆగస్టు 7న కలకత్తాలో ప్రారంభమైన స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకుంటూ కేంద్ర ప్రభుత్వం 2015 నుంచి ప్రతి సంవత్సరం ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా నిర్వహిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఆధునిక కాలంలో సంప్రదాయ కులవృత్తులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని ప్రోత్సాహక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి పౌరుడు వారంలో కనీసం ఒక రోజు అయినా చేనేత దుస్తులు ధరించి, చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా చేనేత కార్మికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కోట శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్ర నాగరాజు, గౌరవ అధ్యక్షులు కొరివి బసవయ్య, తుమ్మ లక్ష్మీనారాయణ, కార్యదర్శులు కుర్రి నరసింహారావు, వెన్నం వెంకట్రావు, సిరిపురం కోటేశ్వరరావు, గంగిశెట్టి శ్రీనివాసరావు, దాసరి విశ్వేశం, తాటి సత్యనారాయణ, దాసరి అనిల్ కుమార్, వెనగాల వెంకటేశ్వర్లు, ఆమంచి సత్యనారాయణ, భోగ గోపి, ఊసకోయల రాజశేఖర్, శ్రీరామ్ రమేష్, ఆడప శ్రీనివాస్, వెనగాల ఇస్తారి, కొరివి రంగయ్య, అడిచర్ల కొమరయ్యతో పాటు పెద్ద సంఖ్యలో పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

## మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే


# ఆరోగ్య శ్రీ పథకం



**- కొమ్ము రాజశేఖర్ మాదిగ.**

**రంగారెడ్డి ఆగస్టు 7 ,అనంత జనశక్తి న్యూస్**
మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే ఆరోగ్య శ్రీ పథకం ఆచరణలోకి వచ్చింది అని ఎల్బీనగర్ ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్ము రాజశేఖర్ మాదిగ అన్నారు. కొత్తపేట లో కొమ్ము రాజశేఖర్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ పోరాటం ఫలితంగానే ఆరోగ్యశ్రీ పథకం తీసుకురావడం జరిగింది అని 2004 ఆగస్టు7 న గుండె జబ్బుల చిన్నారుల సదస్సు జరిగింది.ఆ సదస్సులో ఒక బాలుడు మృతి చెందగా మృతదేహంతో ట్యాంక్ బండ్ పై మందకృష్ణ మాదిగ ఆందోళనతో ప్రభుత్వం దిగివచ్చి ఉచితంగా ఆపరేషన్ చేపిస్తామని ప్రకటించింది అని, ఆరోగ్యశ్రీ రూప కల్పనా పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు మీసాల నాగరాజు, డప్పు కళాకారుల సంఘం మహంకాళి శ్రవణ్, సురారపు హుస్సేన్, పాల్వాయి రమేష్ ఇరుగు చంటి ఇరుగు నాగరాజు, శ్రీను,, సతీష్, రవి, వెంకటేష్, వెంకన్న,, యల్లయ్య, బాలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ దీపాలతో సర్వాంగసుందర రంగా ఆలయాలు



**- ఘనంగా బోనాల పండుగ ఏర్పాట్లు**

**నాగార్జునసాగర్,ఆగస్టు 7 అనంత జనశక్తి న్యూస్**
నాగార్జునసాగర్ పట్టణంలో తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను పురస్కరించుకుని స్థానిక ఆలయాలు సర్వాంగసుందరంగా ముస్తాబవు తున్నాయి,ఆదివారం ఘనంగా నిర్వహించనున్న ఈ పండుగ వేడుకల కోసం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. పట్టణంలోని ప్రధాన కాలనీల్లో ఉన్న అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడేందుకు సిద్ధమయ్యాయి. ముఖ్యంగా పైలాన్ కాలనీలోని పోచమ్మ దేవాలయం,హిల్ కాలనీ డౌన్ పార్క్ ప్రాంతంలో వెలసిన ప్రసిద్ధ శ్రీ కాళికా మాతా దేవి,ముత్యాలమ్మ ఆలయలలో బోనాల ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలను ఆకర్షణీయమైన 'ద్యుద్దీపాలు, పూలతో,అలంకరిం చారు ,ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించు కుని, భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు.ఈ నేప థ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నారు. ఉత్సవాలను విజయవంతం చేయడానికి స్థానిక ప్రజలు,కూడా ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి.

# చిన్నారుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి..



**- మణుగూరులో బాలల హక్కుల కమిషన్ సభ్యురాలి విస్తృత పర్యటన**

**మణుగూరు, ఆగస్టు 7 (అనంత జనశక్తి):**
తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (టీజీఎస్‌సీపీసీఆర్) సభ్యురాలు కంచర్ల వందన గౌడ్ శుక్రవారం మణుగూరులో విస్తృతంగా పర్యటించారు. ముందుగా మణుగూరు ప్రాజెక్టు శేషగిరి నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆమె అన్నప్రాసన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రాథమిక పాఠశాల నిర్వహణ, ప్రీస్కూల్ విద్యా కార్యక్రమాలు, చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, ఆరోగ్య సేవలు, నిర్వహిస్తున్న రిజిస్టర్లు, బాలల హాజరు తదితర అంశాలను పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం నాణ్యతపై వివరాలు తెలుసుకున్న ఆమె, పిల్లలతో ఆప్యాయంగా మాట్లాడి వారి అభ్యాస సామర్థ్యాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

అనంతరం మణుగూరులోని బాలికల చిల్డ్రన్స్ హోంను సందర్శించిన వందన గౌడ్ అక్కడి వసతులు, పరిశుభ్రత, బాలికలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. బాలికల విద్య, నైపుణ్యాభివృద్ధి, ఎదుర్కొంటున్న సమస్యలపై వారితో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బాలికలను ఎట్టి పరిస్థితుల్లోనూ దండించవద్దని, వారికి స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం బాలికలతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి వారికి అందిస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలించారు.

తదుపరి జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కమిషన్ సభ్యురాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు సరిహద్దుగా ఉండటంతో వలస కార్మికుల రాక అధికంగా ఉంటోందని, ఈ నేపథ్యంలో బాల్య వివాహాల నివారణ కోసం ఆయా రాష్ట్రాల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించాలని కోరారు. బాలల రక్షణకు సంబంధించి పరస్పర సహకారంతో కార్యాచరణ రూపొందించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి జె.ఎం. స్వర్ణలత లెనినా, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు సుమిత్రాదేవి, అంబేద్కర్, మణుగూరు ప్రాజెక్టు సీడీపీఓ జయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి హరికుమారి, డీసీపీయూ, చిల్డ్రన్స్ హోం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వర్షాభావాన్ని ఎదుర్కొనేలా ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన

**- పంట కుంటల నిర్మాణం వేగవంతం చేయాలి..**
**- ఆగస్టు 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**
**- వర్షపాతం, సాగునీటి పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణకు కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో ,**
**ఆగస్టు 7 (అనంత జనశక్తి):**
జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే పంట కుంటల నిర్మాణాన్ని విస్తృతంగా ప్రోత్సహించి వర్షపు నీటిని ఒడిసిపట్టే చర్యలు వేగవంతం చేయాలని సూచించారు.

వానాకాల పంటల సాగు, వర్షాభావ పరిస్థితులు, సాగునీటి లభ్యత, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, కొత్త సామాజిక భద్రతా పెన్షన్లు, వన మహోత్సవం తదితర అంశాలపై శుక్రవారం హైదరాబాద్ నుంచి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. జిల్లా ఐడీఓసీ కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి సంబంధిత అధికారులతో హాజరయ్యారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు మాట్లాడుతూ, రాష్ట్రంలోని రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని రైతులకు పంటల ప్రణాళికపై స్పష్టమైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. కాలువల కింద వరి సాగు చేస్తున్న ప్రాంతాల్లో సాగునీటి లభ్యతపై ముందస్తు అవగాహన కల్పించి రైతులు తగిన నిర్ణయాలు తీసుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు పనిచేయాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలున్నందున తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని, పంటల వైవిధ్యీకరణ ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 8న ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశాలు నిర్వహించి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని, భూగర్భ జలాలు, విద్యుత్ సరఫరా, సాగునీటి పరిస్థితులపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. వన మహోత్సవం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయడంతో పాటు నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే ఆగస్టు 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త సామాజిక భద్రతా పెన్షన్లు అందేలా చర్యలు వేగవంతం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ అంకిత్, మండలాల వారీగా వర్షపాతం, నీటి లభ్యత, పంటల సాగు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి ప్రత్యామ్నాయ పంటలు, పంటల వైవిధ్యీకరణపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

అందుబాటులో ఉన్న వర్షపు నీటిని నిల్వ చేసేందుకు పంట కుంటల నిర్మాణాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. భూగర్భ జలాల పరిరక్షణతో పాటు నీటి వినియోగంలో మితవ్యయం పాటించేలా రైతులకు సూచనలు అందించాలని పేర్కొన్నారు.

అదేవిధంగా ఆగస్టు 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని పకడ్బందీగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త సామాజిక భద్రతా పెన్షన్లు అందేలా ప్రక్రియలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వన మహోత్సవం కింద నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత సంబంధిత శాఖలు తీసుకోవాలని, శాఖల మధ్య సమన్వయంతో ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ అంకిత్ సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి అనూష, సీపీఓ సునీత, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ ప్రామాణికంగా రూపొందించాలి

**- గణాంకాల ఖచ్చితత్వానికి అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలి**
**- గడువులోగా ధృవీకరించిన నివేదికను రాష్ట్రానికి పంపాలి**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో ,**
**ఆగస్టు 7 (అనంత జనశక్తి):**
జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ (డీసీహెచ్‌బీ)ను అత్యంత ప్రామాణికంగా రూపొందించి, గణాంకాల ఖచ్చితత్వం, నాణ్యత, ఏకరూపతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని జనగణన సంచాలకులు భారతి హోళీ కేరి జిల్లా అధికారులను ఆదేశించారు.

జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీపై శుక్రవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి పాల్గొన్నారు.



ఈ సందర్భంగా భారతి హోళీ కేరి మాట్లాడుతూ, తెలంగాణలో తొలిసారిగా ప్రతి జిల్లాకు ప్రత్యేక జనగణన హ్యాండ్‌బుక్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో జనాభా, సామాజిక, ఆర్థిక, పరిపాలనా, మౌలిక వసతులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పొందుపరుస్తామని చెప్పారు. ఈ హ్యాండ్‌బుక్ ప్రభుత్వ విధానాల రూపకల్పన, అభివృద్ధి ప్రణాళికలు, పరిశోధనలకు ప్రామాణిక ఆధారంగా నిలుస్తుందన్నారు. ప్రతి శాఖ నుంచి అధికారిక సమాచారాన్ని మాత్రమే సేకరించి, రెవెన్యూ గ్రామం, పట్టణ స్థాయి వరకు పూర్తి వివరాలతో నమోదు చేయాలని సూచించారు. సమాచారం సంపూర్ణంగా, ఖచ్చితంగా, ఏకరూపంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, నిర్దేశించిన కాలపట్టిక ప్రకారం సమాచార సేకరణ, పరిశీలన, ధృవీకరణ పూర్తి చేసి గడువులోగా రాష్ట్ర జనగణన కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జనగణన సంచాలకులు ఇచ్చిన మార్గదర్శకాలను జిల్లాలో పూర్తిస్థాయిలో అమలు చేస్తామని తెలిపారు. అన్ని శాఖల నుంచి సమాచారాన్ని నిర్ణీత నమూనాలో సేకరించి, పూర్తిస్థాయిలో ధృవీకరించిన అనంతరం జిల్లా జనగణన హ్యాండ్‌బుక్‌ను నిర్ణీత గడువులో రాష్ట్ర కార్యాలయానికి పంపిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, ప్రణాళికాధికారి సునీత, జిల్లా పంచాయతీ అధికారి అనూషతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సుస్థిరాభివృద్ధికి పంచాయతీ ప్రణాళికలే బాట




**- ప్రతి మండలం రెండు అభివృద్ధి లక్ష్యాలు ఎంపిక చేయాలి**
**- ప్రాజెక్టు ఆధారిత పనులకు 25 శాతం ప్రాధాన్యం ఇవ్వాలి**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో ,**
**ఆగస్టు 7 (అనంత జనశక్తి):**
సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో జిల్లా, మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి జిల్లా, మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యాచరణ సమావేశంలో ఆమె మాట్లాడారు.

భారత ప్రభుత్వం నిర్దేశించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో ప్రతి మండలం రెండు లక్ష్యాలను ప్రాధాన్య అంశాలుగా ఎంపిక చేసి, వాటికి సంబంధించిన కనీసం 25 శాతం ప్రాజెక్టు ఆధారిత కార్యకలాపాలను మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో తప్పనిసరిగా పొందుపరచాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల అవసరాలు, స్థానిక పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు గ్రామాల వాస్తవ అవసరాలను ప్రతిబింబించేలా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పేదరిక నిర్మూలన, జీవనోపాధి మెరుగుదల, నాణ్యమైన విద్య, ఆరోగ్య సేవలు, తాగునీరు, పారిశుద్ధ్యం, మహిళా సాధికారత, పచ్చదనం, సామాజిక న్యాయం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.

గ్రామీణ పర్యాటకం, ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులు, పౌల్ట్రీ, పశు సంవర్ధక అభివృద్ధి, సేంద్రీయ వ్యవసాయం, మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ఆదాయ వృద్ధి కార్యక్రమాలను ప్రణాళికల్లో చేర్చాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి నిధుల సమీకరణ ద్వారా గ్రామాల సమగ్రాభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

ప్రతి ప్రాజెక్టుకు లక్ష్యం, వ్యయం, నిధుల వనరు, అమలు చేసే శాఖ, కాలపట్టిక, ఆశించిన ఫలితాలను స్పష్టంగా పేర్కొంటూ ప్రణాళికలు సిద్ధం చేయాలని, నిర్ణీత గడువులోగా ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, జిల్లా ప్రణాళిక అధికారి సునీత, జిల్లా పంచాయతీ అధికారి అనూష, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రామాయంపేటలో ముగ్గురు బాలురు అదృశ్యం

**హైదరాబాద్, ఆగస్టు 7 (అనంత జనశక్తి):**
ఇళ్ల ముందు ఆడుకుంటున్న ముగ్గురు బాలురు అదృశ్యమైన ఘటన మెదక్ జిల్లా రామాయంపేటలో గురువారం రాత్రి జరిగింది. స్థానిక ఎస్సై బాల్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కేసీఆర్ కాలనీకి చెందిన ధనుష్ (8వ తరగతి), మనోజ్ (8వ తరగతి), షేక్ సమీర్ (9వ తరగతి) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. స్నేహితులైన వీరు ముగ్గురు రాత్రి వరకు కాలనీలోనే ఆడుకున్నారు. ఆ తర్వాత కనిపించకుండా పోయారు. పిల్లలు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన వారి కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టినట్టు చెప్పారు.





# బెల్లం లేదా తేనె, షుగర్ ఉన్నవారు ఏది తినాలో చెప్పిన డాక్టర్, అసలు సంగతి తెలిస్తే ఆశ్చర్యపోతారు

ఈ రోజుల్లో చాలా మంది మధుమేహం వ్యాధితో బాధపడుతున్నారు. డయాబెటిస్ అనేతి గత కొన్నేళ్లుగా దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా వేగంగా వ్యాప్తి చెందుతున్న వ్యాధి. 1980ల్లో 108 మిలియన్ల డయబెటిస్ రోగుల సంఖ్య ఉండగా.. అది 2014లో 422 మిలియన్లను పెరిగింది. సరైన ఆహారం లేకపోవడం, క్షీణిస్తున్న జీవనశైలి, ఒత్తిడి కారణంగా ఈ వ్యాధి అనేక అవయవాల్ని దెబ్బతీస్తుంది. అధిక రక్తంలో చక్కెర స్థాయిలు మూత్రపిండాల వైఫల్యం, గుండె జబ్బులు, స్ట్రోక్, అంధత్వం వంటి పరిస్థితులకు కారణమవుతాయి. అందుకే తినే ఆహారం విషయంలో డయాబెటిక్ రోగులు చాలా జాగ్రత్తగా ఉండాలి.




ఇక, రక్తంలో షుగర్ లెవల్స్ నియంత్రించడానికి చక్కెర ఉన్న ఆహారాల్ని నివారించడం చాలా అవసరం. ఈ రోజుల్లో చాలా మంది చక్కెరకు బదులు బెల్లం లేదా తేనెను వాడుతున్నారు. అయితే, డయాబెటిస్ రోగులకు బెల్లం లేదా తేనె ఏది మంచిదో చాలా మందికి క్లారిటీ లేదు. ఈ విషయంలో డయాబెటిస్ స్పెషాలిటీస్ సెంటర్ చైర్మన్, డాక్టర్ వి. మోహన్ క్లారిటీ ఇచ్చారు. ఆ పూర్తి వివరాలపై ఓ లుక్కేద్దాం.





**బెల్లం**

మన ఇళ్లల్లో బెల్లాన్ని వివిధ రకాల వంటకాల్లో ఉపయోగిస్తారు. ఈ ఆరోగ్యకరమైన చక్కెర ప్రత్యామ్నాయాన్ని ఆహారంలో చేర్చడానికి అనేక మార్గాలు ఉన్నాయి. బెల్లం పొటాషియం, మెగ్నీషియం, విటమిన్లు B1, B6, విటమిన్ సిలకు గొప్ప మూలం. మధుమేహ వ్యాధిగ్రస్తులు తరచుగా చక్కెర కంటే బెల్లంను ఇష్టపడతారు. ఇది ఫైబర్ యొక్క మంచి మూలం. బెల్లం శరీరం నుంచి టాక్సిన్లను బయటకు పంపడంలో సాయపడుతుంది. బెల్లం జీర్ణవ్యవస్థను మెరుగుపర్చడంలో కూడా సాయపడుతుంది. ఉదయం ఒక గ్లాసు గోరువెచ్చని నీరు, బెల్లం తీసుకోవడం వల్ల అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. బెల్లం ఆక్సీకరణ ఒత్తిడిని ఎదుర్కోవడంలో సాయపడే అనేక ఫినాలిక్ సమ్మేళనాల్ని కలిగి ఉంది.

**తేనె**

తేనె అనేది పూల మకరందం నుంచి తేనెటీగలు తయారు చేసే రుచికరమైన చిక్కని ద్రవం. దీనిని శతాబ్దాలుగా ఔషధంగా ఉపయోగిస్తున్నారు. ఆయుర్వేదంలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. తేనెలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరం వ్యాధులతో పోరాడటానికి సాయపడతాయి. అంతేకాకుండా గొంతు నొప్పి, దగ్గును తగ్గించడంలో సాయపడుతుంది. జీర్ణక్రియకు కూడా మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. దాన్ని పోషకాలు తగ్గకుండా ఉండాలంటే నేరుగా తినాలని సిఫార్స్ చేస్తున్నరు. అయితే, తేనెలో కేలరీలు, ఫ్రక్టోస్ అధికంగా ఉంటాయి. అందుకే దీని వినియోగం చాలా పరిమితంగా ఉండాలి.

**డాక్టర్ ఏం చెప్పారంటే**

డాక్టర్ వి. మోహన్ ప్రకారం.. బెల్లం, తేనె తీసుకోవడం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. వాటిని తీసుకోవడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. అంతేకాకుండా అనేక వ్యాధుల చికిత్సకు సాయపడుతుంది. డయాబెటిస్ లేనివారు బెల్లం తినవచ్చు. బెల్లం చక్కెర కంటే ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుంది. శుద్ధి చేసిన చక్కెర బరువును పెంచడమే కాకుండా శరీరానికి చాలా హాని కలిగిస్తుంది. బెల్లం, తేనె రెండూ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కానీ తినేటప్పుడు అవి చక్కెరగా మారుతాయి. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి. డయాబెటిస్ ఉన్నవారు వీటిని ఎక్కువ తీసుకోవడం నివారించాలని నిపుణులు చెబుతున్నారు.

**బెల్లం రక్తంలో చక్కెరను ఎలా పెంచుతుంది?**

తరచుగా డయాబెటిక్ రోగులు తీపి కోరికల్ని నియంత్రించడానికి బెల్లం తీసుకుంటారు.

# డైటీషియన్ చెప్పిన ఈ ఆహారం తీసుకుంటే.. ముఖంపై అవాంఛిత రోమాలు మాయం అవుతాయ్





ప్రస్తుత లైఫ్‌స్టైల్ కారణంగా చాలా మంది మహిళల్లో హార్మోనల్ల సమతుల్యత దెబ్బతింటుంది. టీనేజ్ అమ్మాయిలు, మహిళలు కూడా.. హార్మోన్ల అసమతుల్యత కారణంగా రకరకాల సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఆరోగ్య సమస్యలే కాదు.. సౌందర్యానికి చిక్కులు తెస్తుంది. అందులో ఒకటి.. అవాంఛిత రోమాలు. పెదవుల పైన, గడ్డం మీద, గడ్డం కింద.. వెంట్రుకలు మొలుస్తుంటాయి. కొందరిలో ఈ గ్రోత్ చాలా ఎక్కువగానే ఉంటుంది.. పురుషుల వలే.. చిన్న మీసాలు కనిపిస్తుంటాయి. ఈ సమస్య నుంచి తాత్కాలికంగా తప్పించుకోవడానికి.. కొందరు వ్యాక్సింగ్, షేవింగ్ చేసుకుంటూ ఉంటారు. మరికొందరు ట్రీట్మెంట్స్ తీసుకుంటూ ఉంటారు. మన డైట్‌లో హార్మోన్ల సమతుల్యతకు మద్దతు ఇచ్చే ఆహారం తీసుకుంటే.. అవాంఛిత రోమాలు వెనుక ఉన్న ప్రధాన ట్రిగ్గర్‌లలో ఒకదాన్ని తగ్గించవచ్చు. డైటీషియన్ మన్‌ప్రీత్ కల్రా హార్మోన్లను బ్యాలెన్స్ చేసే ఆహారాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో షేర్ చేశారు. అవేంటో చూసేద్దాం.







**స్పియర్‌మింట్ టీ..**

స్పియర్‌మింట్ టీ రోజూ రెండు కప్పులు తీసుకుంటే.. శరీరంలోని ఫ్రీ టెస్టోస్టెరాన్, ఆండ్రోజెన్ స్థాయిలు తగ్గుతాయి. ఈ రెండూ హార్మోన్ల స్థాయులు పెరిగితే.. ముఖంపై అవాంఛిత రోమాలు పెరిగుతాయి. ఈ హెర్బల్ టీ మీ హార్మోన్ల సమతుల్యతను ప్రోత్సహిస్తుందని మన్‌ప్రీత్ కల్రా అన్నారు.

**సిట్రస్ పండ్లు..**

నిమ్మ, నారింజ, ద్రాక్షపండ్లు వంటి పండ్లలో సమృద్ధిగా ఉండే.. విటమిన్ సి శరీరంలో ఇనోసిటాల్ శోషణను పెంచుతుంది. ఇది ఇన్సులిన్‌ను నియంత్రించడంలో సహాయపడుతుంది, కాలక్రమేణా టెస్టోస్టెరాన్ స్థాయిలను తగ్గిస్తుంది. సిట్రస్ పండ్లను రోజూ మీ ఆహారంలో తీసుకుంటే.. హార్మోన్లు బ్యాలెన్స్ అవ్వడమే కాదు.. ఇమ్యూనిటీ పెరుగుతుంది, మీ చర్మం మిలమిల మెరుస్తుంది.

**దాల్చిన చెక్క నీరు..**

భోజనం చేసిన తర్వాత.. దాల్చిన చెక్క పొడి వేసిన నీరు తాగితే.. బ్లడ్ షుగర్ కంట్రోల్‌లో ఉంటాయి. ఇన్సులిన్ రెసిస్టేన్స్ మెరుగ్గా ఉంటే.. ఆండ్రోజెన్ కంట్రోల్‌లో ఉంటుంది. ఇది క్రమక్రమంగా.. అవాంఛిత రోమాలు పెరగకుండా చేస్తుంది. దాల్చిన చెక్క నీళ్లు భోజనం తర్వాత తీసుకుంటే.. జీవక్రియ మెరుగుపడుతుందని.. మన్‌ప్రీత్ కల్రా అన్నారు.

**గుమ్మడికాయ గింజలు..**

గుమ్మడికాయ గింజల్లో జింక్ పుష్కలంగా ఉంటుంది, ఇది టెస్టోస్టెరాన్ స్థాయిలను పెంచడానికి కారణమయ్యే ఎంజైమ్‌లను అడ్డుకుంటుంది. గుమ్మడి గింజలు రోజూ తింటే.. హార్మోన్లు బ్యాలెన్స్‌గా ఉంటాయి. గుమ్మడి గింజల్లో.. ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్ కూడా మెండుగా ఉంటాయి. ఇవి మన ఆరోగ్యానికి తోడ్పడతాయి.

**ఉడికించిన క్రూసిఫరస్ కూరగాయలు..**

బ్రోకలీ, కాలీఫ్లవర్, క్యాబేజీ వంటి క్రూసిఫరస్ కూరగాయలు ఉండికించి తీసుకుంటే.. ఈస్ట్రోజెన్‌ను సమర్ధవంతంగా జీవక్రియ చేసే శరీర సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఇది హార్మోన్ల సమతుల్యతను ప్రోత్సహిస్తుంది. చర్మం కాంతివంతంగా మారడంతో పాటు.. జుట్టు చక్కగా పెరుగుతుంది.

**నానబెట్టిన మెంతులు..**

ఉదయం ఖాళీ కడుపుతో నానబెట్టిన మెంతులు తీసుకుంటే..ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తాయి, ఆండ్రోజెన్ స్థాయిలను తగ్గిస్తాయి. తద్వారా క్రమంగా.. అవాంఛిత రోమాలు తగ్గుముఖం పడతాయి.

## ఎప్పటికీ నిలిచిపోయేలా.. 'సర్దార్ సర్వాయి పాపన్న'



బహుజన చక్రవర్తిగా కీర్తికెక్కిన 'సర్దార్ సర్వాయి పాపన్న' జీవిత కథతో రూపొందిన ఓ గొప్ప చిత్రం మా ఆర్కే ఫిల్మ్స్ నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో విడుదల కానుండడం ఎంతో ఆనందంగా ఉందన్నారు నిర్మాత ప్రతాని రామకృష్ణగౌడ్. వెంకటేశ్ గౌడ్ లింగంపల్లి దర్శకనిర్మాణంలో రూపొందిన యానిమేషన్ చిత్రమే 'సర్దార్ సర్వాయి పాపన్న'. వి.జి.మూవీ మేకర్స్ సమర్పిస్తోంది. దీపక్ న్యాతి నిర్మాణ పర్యవేక్షణ చేశారు. వచ్చే వారం ఆర్.కె.ఫిల్మ్స్ పతాకంపై ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో పోస్టర్ ఆవిష్కరణ వేడుక జరిగింది. నిర్మాత ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ "గోల్కొండ కోటపై జెండా ఎగరేసిన వీరుడి జీవితాన్ని నేటితరానికి పరిచయం చేస్తూ ప్రేక్షకుల మనసుల్లో ఎప్పటికీ నిలిచిపోతుంది ఈ చిత్రం" అన్నారు.

## నాగార్జున మెచ్చుకోవడం ఆనందాన్నిచ్చిం-

'బిగ్ బాస్' షోలో జంటగా అలరించిన డెమాన్ పవన్, రీతూ చౌదరి ఇప్పుడు "బంగారం." పాటతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. విజ్జు ముదిరాజ్ నృత్యరీతులందిస్తూ.. స్వయంగా తెరకెక్కించిన ఈ గీతానికి రంజిత్ రెడ్డి స్వరాలు సమకూర్చారు. అఫ్రోజ్ అలీ సాహిత్యమందించడంతో పాటు సమీరా భరద్వాజ్‌తో కలిసి ఆలపించారు. ఈ పాట ఇటీవల విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నటుడు డెమాన్ పవన్ మాట్లాడుతూ.. "ఈ పాటని నాగార్జున సర్ విని, బాగుందని చెప్పడం.. స్వయంగా విడుదల చేయడం ఆనందాన్నిచ్చింది. నేను నా డీపీ క్రియేషన్స్ పతాకంపై రాబోయే రోజుల్లో వెబ్‌సిరీస్‌లు, సినిమాలు నిర్మించాలని ప్రణాళికలు రచిస్తున్నా. దానికి అందరి ప్రేమాభిమానాలు కావాలి" అన్నారు. ఈ కార్యక్రమంలో రీతూ చౌదరి, సమీరా, అఫ్రోజ్ అలీ, విజ్జు తదితరులు పాల్గొన్నారు.



## డ్రెస్ రంగు గురించి విచిత్రమైన ప్రశ్న.. ప్రియా ప్రకాష్ వారియర్ స్మార్ట్ కౌంటర్‌కు షాక్ అయిన యూట్యూబర్!

ఒక్క కన్నుగీటుతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న మలయాళ నటి ప్రియా ప్రకాష్ వారియర్ మరోసారి వార్తల్లో నిలిచారు. తాజాగా ఓ ప్రమోషనల్ ఈవెంట్‌లో ఆమెను ఉద్దేశించి యూట్యూబర్ అడిగిన వివాదాస్పద ప్రశ్నకు ప్రియా ఎంతో హుందాగా, సమయస్ఫూర్తితో సమాధానం చెప్పి అందరి ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇటీవల తాను బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న ఓ సంస్థ నిర్వహించిన ప్రొడక్ట్ లాంచ్ కార్యక్రమంలో ప్రియా ప్రకాష్ వారియర్ పాల్గొన్నారు. ఆ సంస్థ అధికారిక థీమ్‌కు అనుగుణంగా కాషాయ (సాఫ్రాన్) రంగు దుస్తులు ధరించి వేదికపై కనిపించారు.



ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఓ యూట్యూబర్, "కేరళలో ఇప్పుడు ఆరెంజ్ అలర్ట్ ఉంది కదా.. అందుకే ఈ రంగు డ్రెస్ వేసుకొచ్చారా?" అంటూ ప్రశ్నించాడు. డ్రెస్ రంగుకు రాజకీయ కోణం ఆపాదించేలా అడిగిన ఈ ప్రశ్నతో అక్కడ కొద్దిసేపు గందరగోళం నెలకొంది. అయితే ప్రశ్న విన్న వెంటనే క్షణం పాటు ఆశ్చర్యానికి గురైన ప్రియా వారియర్, వెంటనే తేరుకుని చిరునవ్వుతో స్పందించారు. "నా ప్రియమైన అన్నయ్య..." అంటూ ప్రారంభించిన ఆమె, "గత కొన్నేళ్లుగా ఈ బ్రాండ్ అధికారిక థీమ్ కలర్ ఆరెంజ్‌నే. బ్రాండ్ అంబాసిడర్‌గా ఆ సంస్థకు గౌరవం ఇవ్వడానికే ఈ రంగు దుస్తులు ధరించాను. దీనికి రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదు" అని స్పష్టం చేశారు.

అనవసర వివాదాలు సృష్టించేలా ప్రశ్నలు అడగడం కంటే సందర్భానికి తగిన ప్రశ్నలు అడగాలని ఆమె సమాధానం పరోక్షంగా సూచించినట్లైంది. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతోంది. కేవలం వ్యూస్, లైక్స్ కోసం సెలబ్రిటీలను ఇబ్బందిపెట్టే ప్రశ్నలు అడగడం సరికాదని నెటిజన్లు యూట్యూబర్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు. మరోవైపు, ఇబ్బందికర పరిస్థితిలోనూ హుందాగా స్పందించిన ప్రియా ప్రకాష్ వారియర్‌ను ప్రశంసిస్తున్నారు.'ఒరు అదార్ లవ్' చిత్రంలోని కన్నుగీటే సన్నివేశంతో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా పాపులర్ అయిన ప్రియా ప్రకాష్ వారియర్,

ఈఆ తర్వాత పలు దక్షిణాది భాషల్లో అవకాశాలు అందుకున్నారు. తెలుగులో నితిన్‌తో 'చెక్', తేజ సజ్జతో 'ఇష్క్' చిత్రాల్లో హీరోయిన్‌గా నటించారు. అలాగే పవన్ కళ్యాణ్, సాయి దుర్గ తేజ్ నటించిన 'బ్రో' చిత్రంలో కీలక పాత్రలో కనిపించారు. ప్రస్తుతం మలయాళం, హిందీ, కన్నడ చిత్రాలతో బిజీగా ఉన్న ప్రియా ప్రకాష్ వారియర్, సోషల్ మీడియాలో కూడా భారీ ఫాలోయింగ్‌తో తన అభిమానులను అలరిస్తూనే ఉన్నారు.

## అందుకే.. హేజిల్‌వుడ్ నాకు బౌలింగ్ చేయనన్నాడు: ఛెతేశ్వర్ పుజారా




మిస్టర్ 'నయా వాల్' ఛెతేశ్వర్ పుజారాకు ఆస్ట్రేలియా స్టార్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ బౌలింగ్ చేసేందుకు ఆసక్తి చూపించలేదట. వీరిద్దరూ ప్రత్యర్థులుగా దిగిన మ్యాచ్‌లో కాదు సుమా..! పుజారా - జోష్ ఒకే జట్టులో ఉంటూ నెట్స్‌లో సాధన చేసే సమయంలోనే ఇది జరిగింది. ఆ విషయాలను పుజారా ఓ పాడ్‌కాస్ట్‌లో వెల్లడించాడు. పుజారా, జోష్ హేజిల్‌వుడ్ సీఎస్‌కే తరఫున ఐపీఎల్‌లో కలిసి ఆడారు. అంతకుముందు బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో ప్రత్యర్థులుగా బరిలోకి దిగి పోటీపడ్డారు.

"2018-19, 2021 ఆస్ట్రేలియాతో జరిగిన సిరీసుల్లో జోష్ హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో చాలా బంతులు ఆడా. ఆ తర్వాత నన్ను ఐపీఎల్‌లో సీఎస్‌కే తీసుకుంది. అప్పటికే జోష్ కూడా చెన్నై జట్టుతోనే ఉన్నాడు. తొలిసారి నేను బ్యాటింగ్ చేసేందుకు నెట్స్‌లోకి వెళ్లా. కానీ, హేజిల్‌వుడ్ నాకు బౌలింగ్ చేసేందుకు విముఖత చూపించాడు. 'అతడికి బౌలింగ్ చేయను' అని అనేశాడు. మేమిద్దరం సహచరులమైనా సరే తిరస్కరించాడు. దానికి కారణం కూడా ఉంది. కొన్ని నెలల ముందే జోష్ బౌలింగ్‌ను ఎదుర్కొన్నా. అందుకే, నాకు బౌలింగ్ చేయకుండా ఆగిపోయినట్లు జోక్ చేశాడు. నెట్స్‌లోనూ ఎప్పుడూ నాకు బౌలింగ్ చేయలేదు" అని పుజారా గుర్తు చేసుకున్నాడు.

అదే ఫ్యాన్‌బాయ్ మూమెంట్..

"నేను కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఐపీఎల్ కెరీర్‌ను ప్రారంభించా. షారుక్ ఖాన్ ఓనర్. తొలిసారి అతడిని కలవడం ఓ అభిమానిగా మరిచిపోలేని క్షణం. అయితే, క్రికెట్ విషయాకొచ్చేసరికి ఆయన మా ఓనర్. ఫ్రాంచైజీ సృష్టించిన వాతావరణం చాలా బాగుంటుంది. గొప్ప ఆటగాళ్లతో కలిసి పనిచేయడం, వారి నుంచి నేర్చుకొనేందుకు వీలుంటుంది. మనలోని క్రికెట్ నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకొనేందుకు సదావకాశం మెరుగుపర్చుకోవచ్చు" అని పుజారా అన్నాడు.

## ఫొటోషాప్‌లో ఫేస్ మార్చి.. పాక్ మీడియా ఫేక్ స్టోరీ అల్లేసింది: ఇర్ఫాన్ పఠాన్




తనపై దుష్ప్రచారం, ట్రోలింగ్ చేయడం వంటివి ప్రతిరోజూ జరుగుతూనే ఉంటాయని భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ వెల్లడించాడు. మరీ ముఖ్యంగా పాకిస్థాన్ మీడియా వండివార్చిన ఫేక్ కథనం తాను ఎప్పటికీ మరిచిపోలేనని తెలిపాడు. తన ఫొటోను మార్చి.. నకిలీ వార్తను సృష్టించిందని విమర్శించాడు. బాబర్ అజామ్‌ను ఇంటర్వ్యూ చేసేందుకు ప్రయత్నించానని అప్పట్లో వార్తలు వచ్చాయని గుర్తు చేసుకున్నాడు.

"ఇప్పుడున్న కాలంలో ట్రోలింగ్ సర్వసాధారణం. అలాగే ఎవరికైనా తప్పుల్ని ఆపాదించడమూ చూస్తున్నాం. మన పొరుగు దేశం మీడియా ఏకంగా నా మీద పెద్ద ఫేక్ స్టోరీనే నడిపింది. బాబర్ అజామ్‌ను ఇంటర్వ్యూ చేసేందుకు నేను వెళ్లానని.. అతడు మాత్రం ఇచ్చేందుకు నిరాకరించాడనే కథనం వండివార్చింది. నేను తన దేశాన్ని ట్రోల్ చేశానని అందుకే ఇంటర్వ్యూ ఇవ్వనని బాబర్ అన్నట్లుగా క్రియేట్ చేసింది. ఫొటోషాప్‌లో నా ఫేస్‌ను ఎడిట్ చేసి వాడేసింది. అదంతా అవాస్తవమేనని తేలిపోయింది. బంగ్లాదేశ్‌కు చెందిన ఓ యువ పాత్రికేయుడి బాడీకి నా ముఖాన్ని అతికించి ఫేక్ స్టోరీని ప్రచారం చేసింది పాక్ మీడియా. లక్షల వ్యూస్ కూడా వచ్చాయి. అది నిజమేనేమోనని కొందరు అభిమానులూ నమ్మారు. ఇప్పుడు ఇలాంటివి ప్రతి రోజూ జరుగుతున్నాయి. కానీ, వాటికి నేను స్పందించను. ప్రతిదానికీ స్పందిస్తూ వెళ్తే.. మన జీవితాన్ని ప్రశాంతంగా గడపలేం" అని ఇర్ఫాన్ ( వ్యాఖ్యానించాడు.

అలా చేస్తేనే గొప్ప వారసత్వం..

"ఓ ప్లేయర్‌గా మీరు గొప్ప వారసత్వం క్రియేట్ చేయాలంటే మాత్రం.. ఐపీఎల్ (IPL) లేదా ఇతర ఏ లీగ్ అయినా సరే అవకాశం ఉంటే ఒకే ఫ్రాంచైజీ తరఫున సుదీర్ఘ కాలం కొనసాగాలి. ఐపీఎల్‌లో నా తొలి జట్టు పంజాబ్. ఆ టీమ్ తరఫున మూడేళ్లు ఆడా. పంజాబ్ యాజమాన్యం మద్దతు మాత్రం అద్భుతం. 2009 సీజన్‌లో వరుస ఓటములతో తీవ్ర నిరుత్సాహంతో ఉన్నాం. అప్పుడు ప్రీతీ జింటా.. తర్వాత మ్యాచ్‌లో గెలిస్తే మంచి భారతీయ భోజనం ఏర్పాటు చేయిస్తానని.. తానే స్వయంగా పరోటాలు వండిపెడతానని చెప్పారు. మేం గెలవడంతో అలాగే చేసి పెట్టారు. గెలుపోటములు సహజం. కానీ, జట్టును ప్రోత్సహించేలా యాజమాన్యం ఉంటే ప్లేయర్లకు అదనపు బలమే అవుతుంది" అని పఠాన్ తెలిపాడు.

## వార్మప్ మ్యాచ్.. ప్రభావం చూపించని భారత బౌలర్లు

శ్రీలంక XIతో వార్మప్ మ్యాచ్‌లో భారత బౌలర్లు పెద్దగా ప్రభావం చూపించలేకపోయారు. తొలి రోజు ఆట ముగిసే సరికి శ్రీలంక XI ఎనిమిది వికెట్ల నష్టానికి 363 పరుగులు చేసింది. క్రీజ్‌లో కేషర నువాంత (9*), దిలుమ్ సుదీరా (1*) ఉన్నారు. నిషాన్ మదుష్క (66), రవిందు రసాంత (71), సోనాల్ దినుష (51) అర్ధశతకాలతో అలరించారు. పవన్ రత్నాయకే (39), విక్రమసింఘె (31), పసిందు సూరియబండారా (35) ఫర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా 2, కుల్‌దీప్ యాదవ్ 2, మానవ్ సుతార్ 2, గుర్నూర్ బ్రార్ ఒక వికెట్ తీశారు.

ఆ ఇద్దరికీ దక్కని వికెట్లు

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక XIజట్టుకు ఓపెనర్లు నిషాన్, రవిందు మంచి ఆరంభం ఇచ్చారు. తొలి వికెట్‌కు 110 పరుగులు జోడించారు. భారత పేస్ బౌలర్లు సిరాజ్, ప్రసిద్ధ్‌కు వికెట్ దక్కలేదు. వీరిద్దరూ 21 ఓవర్లు వేసి 76 పరుగులు ఇచ్చారు. బుమ్రా లేకుండానే శ్రీలంకతో టెస్టు సిరీస్‌ను ఆడనుంది. ఈ క్రమంలో వికెట్ లేకపోవడం భారత శిబిరంలో కాస్త ఆందోళన కలిగించేదే. కొత్త బౌలర్ సారాంశ్ జైన్ (11-0-54-0) కూడా ఇబ్బంది పడ్డాడు. అయితే, కుల్‌దీప్‌తోపాటు జడేజా, సుతార్ నాణ్యమైన బౌలింగ్‌తో వికెట్లు దక్కాయి.

గిల్ గైర్హాజరు..

వార్మప్ మ్యాచ్ తొలి రోజు ఆటకు భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ దూరంగా ఉన్నాడు. గురువారం ప్రాక్టీస్ చేస్తుండగా చేతి వేలికి గాయమైన సంగతి తెలిసిందే. దీంతో అతడికి బదులు కేఎల్ రాహుల్ సారథ్యం నిర్వర్తించాడు. రెండో రోజు గిల్ ఫిట్‌గా ఉంటే బరిలోకి దిగే అవకాశం ఉంది. అదీ సాధ్యం కాకపోతే.. నేరుగా ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో జరగనున్న తొలి టెస్టులోనే ఆడతాడు.

## గ్రాండ్ చెస్ టూర్ సెయింట్ లూయిస్ టైటిల్ విజేతగా ప్రజ్ఞానంద

భారత చెస్ క్రీడాకారుడు ఆర్ ప్రజ్ఞానంద (Praggnanandhaa Won) తొలిసారి సెయింట్ లూయిస్ రాపిడ్ అండ్ బ్లిట్జ్ టైటిల్‌ను గెలిచాడు. మరొక రౌండ్ మిగిలి ఉండగానే అతడు విజేతగా నిలిచాడు. జావోఖిర్ సిందరోవ్‌తో మ్యాచ్‌ను డ్రా చేసుకోవడంతో 23.5/35 పాయింట్లు సాధించాడు. ఇతర ప్లేయర్ల కంటే ఒకటిన్నర పాయింట్లు ఎక్కువగా ఉండటంతో టైటిల్ ఖాయమైంది. ఈ మేరకు భారత చెస్ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది.

"భారత చెస్ అభిమానులకు గుడ్ న్యూస్. ప్రజ్ఞానంద (Praggnanandhaa) గ్రాండ్ చెస్ టూర్ సెయింట్ లూయిస్ రాపిడ్ అండ్ బ్లిట్జ్ విజేతగా అవతరించాడు. ఇది అతడికి తొలి రాపిడ్ అండ్ బ్లిట్జ్ టైటిల్. కంగ్రాట్స్ ప్రజ్ఞానంద" అని పోస్టు చేసింది. ఈ ఏడాదిలో నార్వే చెస్ 2026 టైటిల్‌ను కూడా ఈ 20 ఏళ్ల కుర్రాడు గెలిచిన సంగతి తెలిసిందే.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945